E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 12-03-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:69|| పేజీలు–6

www.ekaburu.com

## పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్....



ఈ-కబురు, శేరిలింగంపల్లి : పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్ నగరంపై ప్రభావం చూపిస్తుంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరతతో ఐటీ కారిడార్ కు గ్యాస్ కష్టాలు మొదలయ్యా

....(మిగతా3లో)




### సవాళ్లకు అనుగుణంగా సైన్యాన్ని మార్చడమే లక్ష్యం

ఈ కబురు, హైదరాబాద్: మారుతున్న ప్రపంచ భద్రతా సవాళ్లకు అనుగుణంగా భారత సైన్యాన్ని అత్యాధునిక సాంకేతికతతో, వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు.





### స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాసం

ఈ కబురు, ఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం నిర్వహించిన ఓటింగులో మూజువాణి ఓటుతో సభ దీనిని తిరస్కరించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన కొన్ని వ్యాఖ్యలు వాతావరణాన్ని వేడెక్కించాయి.




### సీఈసీ తొలగింపునకు ఎంపీల సంతకాలు

ఈ కబురు, ఢిల్లీ: కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలనే తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తి అభిశంసనకు అనుసరించాల్సిన ప్రక్రియే సీఈసీకీ వర్తిస్తుంది.



# ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్

దానం, కడియంలపై అనర్హత పిటిషన్ల డిస్మిస్

తీర్పు వెల్లడించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పార్టీ మారినట్లుగా ఆధారాల్లేవని స్పష్టీకరణ

భారాస ఫిర్యాదు చేసిన 10 మంది ఎమ్మెల్యేలకూ క్లీన్‌చిట్

--పలు దఫాలుగా విచారణ.. తీర్పులు

తమ పార్టీకి చెందిన పది మంది శాసనసభ్యులు.. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (గద్వాల), ఎం.సంజయ్ (జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), కాలె యాదయ్య (చేవెళ్ల), తెల్లం వెంకట్రావు (భద్రాచలం) అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్), కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్)లు.. కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం

ఈ కబురు, హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలపై దాఖలైన అనర్హత పిటిషన్లను శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ డిస్మిస్ చేశారు. భారాస తరఫున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరారని అందిన ఫిర్యాదులపై విచారణ జరిపిన అనంతరం ఆ పిటిషన్లను కొట్టివేశారు. దానం, కడియం పార్టీ మారినట్లుగా సరైన ఆధారాలు లేవని స్పష్టం చేశారు. అసెంబ్లీలో బుధవారం ఈ మేరకు స్పీకర్ తీర్పు వెల్లడించారు. దీంతో ఇప్పటి వరకు పార్టీ ఫిరాయింపుపై భారాస ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసిన

....(మిగతా2 లో)

## తెలుగులో శివప్రతాప్ శుక్లా

# ప్రమాణం

బాధ్యతలు స్వీకరించిన గవర్నర్

హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర 5వ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవగా... శివప్రతాప్ శుక్లాను తెలంగాణ గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన ఉత్తర్వులను గవర్నర్ కార్యదర్శి దానకిశోర్ చదివి వినిపించారు. అనంతరం శివప్రతాప్ శుక్లా తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతల స్వీకరణ తర్వాత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవర్నర్... సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గవర్నర్‌తో ఫొటో దిగారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

....(మిగతా2లో)

## వెయ్యి ఇళ్లు కూలగొట్టి..

# 310 మందికే నివాస స్థలాలా?

- ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించాలి
- భూదాన్ భూములను కబ్జా చేసింది కాంగ్రెస్ నాయకులే
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్




ఈ కబురు, హైదరాబాద్: ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో 1,000 ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసి.. ఇప్పుడు కేవలం 310 మందికే ఇళ్ల స్థలాల పట్టాలివ్వడమేంటని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. ఒక్కో కుటుంబం 100 గజాల్లో ఇల్లు కట్టుకుంటే.. ఇప్పుడు 75 గజాలకే పట్టాలిస్తున్నారని, మిగిలిన 25 గజాల భూమిని ఎవరు దక్కించుకుంటున్నారని ఆయన నిలదీశారు. ఎక్కడైతే ఇళ్లు కూలగొట్టారో.. అక్కడే తిరిగి పట్టాలు ఇచ్చి.. ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆస్తి నష్టానికిగాను ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల తక్షణ పరిహారం చెల్లించాలన్నారు. వెలుగుమట్ల ఘటనపై తెలంగాణ భవన్‌లో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

....(మిగతా2లో)



## ఎంత వరదొచ్చినా తట్టుకునేలా

# రక్షణ గోడ

- మురుగు కలవకుండా భారీ ట్రంక్‌లైన్, ఎస్టీపీలు
- మొదటి దశలో 21 కి.మీ. మేర మూసీ పునరుజ్జీవ పనులు
- రూ.7వేల కోట్లతో అభివృద్ధి ప్రణాళిక

ఈ కబురు, హైదరాబాద్: ఎంత వరద వచ్చినా తట్టుకొనేలా రక్షణ గోడ నిర్మాణాలు.. ప్రజలకు ఆహ్లాదం పంచేలా పార్కులు.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలకంగా మారేలా వాణిజ్య సముదాయాలతో మూసీ సరికొత్త రూపు సంతరించుకోనుంది.

....(మిగతా3లో)

## భూదాన్ నిర్వాసితులు

# ఆత్మగౌరవంతో బతకాలి

- నేడు భూమి పూజ, డిసెంబరు 9న సీఎం చేతుల మీదుగా గృహప్రవేశం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- బాధితులకు స్థలాలు, ఇళ్ల పట్టాల పంపిణీ



కబురు, ఖమ్మం: వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితులు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో అర్హులకు స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆ స్థలాల్లో గురువారం ఇంటి నిర్మాణానికి భూమిపూజ జరిపి.. డిసెంబరు 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గృహ ప్రవేశాలు చేయిస్తామని పేర్కొన్నారు.

....(మిగతా2లో)

# ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ



ఇంధన రవాణాకు ఆటకు కలకుండా అమెరికా వ్యూహం

మధ్య ప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధం..!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

హోర్ముజ్ జల సంధిలో ఉద్రిక్తతలు

ప్రపంచ వాణిజ్యానికి తీవ్ర విఘాతం

ఈ జల సంధి ద్వారా 97 శాతం పడిపోయిన నౌకల రాకపోకలు

ఎల్ ఎన్ జి, ఎరువులు ఈ మార్గం ద్వారానే రవాణా

ప్రతిరోజు 20 మిలియన్ బ్యారెళ్ళ చమురు ఈ మార్గం ద్వారానే రవాణా

అందులో 84 శాతం ఆసియా దేశాలకే

....(మిగతా2లో)

## సంక్షోభ స్థాయికి వంటగ్యాసు కొరత

- ఏజెన్సీల ముందు వినియోగదారుల బారులు



ఈ కబురు, ఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. ముంబయి, ఢిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి.

....(మిగతా3లో)

## చమురులో కాలేసిన అమెరికా



- ఇంధన సంక్షోభాన్ని తక్కువగా అంచనా వేసిన ట్రంప్ బృందం
- ఇరాన్‌లో అధికార మార్పిడి ముందు ఇది చిన్న సమస్యేనని భావన
- చివరకు తెలిసొచ్చిన వాస్తవం

....(మిగతా3లో)

## ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ

# రింగు రోడ్లు



- ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లు: సీఎం రేవంత్ రెడ్డి
- హైదరాబాద్ నుంచి నిర్దేశిత సమయంలో చేరేలా ప్రణాళికలు
- ప్రభుత్వ శాఖలు ఈవీ వెహికల్స్‌నే కొనాలి
- బోధనాసుపత్రులు, పెద్దాసుపత్రుల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలి
- రవాణా శాఖ ఆదాయం పెరిగే మార్గాలపై దృష్టి పెట్టాలి
- ఆర్ అండ్ బీ, రవాణా శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

....(మిగతా2లో)



## పశ్చిమాసియా యుద్ధ పర్యవసానాల్ని ఎదుర్కొంటాం

# తిరుచ్చి ఎన్డీయే సభలో ప్రధాని మోదీ

ఈ కబురు, చెన్నై: పశ్చిమాసియా యుద్ధ ప్రభావాల్ని గమనిస్తున్నామని, భారతీయుల ప్రయోజనాలకు అనుగుణంగానే ముందుకెళ్తామని ప్రధాని మోదీ తెలిపారు. తమిళనాడులోని తిరుచ్చిలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఎన్డీయే కూటమి బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఇదివరకు ఎలాంటి పరిస్థితి తలెత్తినా ప్రజల ఆకాంక్షలకే ప్రాధాన్యమిస్తూ వచ్చామని, ఇప్పుడూ అదే చేస్తామని స్పష్టత ఇచ్చారు. 2021లో తమిళనాడు ప్రజలు డీఎంకేకు అధికారమిచ్చారని, ఇందుకు బాధ్యత తీసుకోకుండా ప్రజల్ని వదిలేసి వారి కుటుంబానికే ప్రాధాన్యతనిస్తూ వెళ్తున్నారని ప్రధాని మోదీ ఆరోపించారు. రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చుకున్నారని ధ్వజమెత్తారు.

....(మిగతా2లో)

## తెలుగులో శివప్రతాప్ శుక్లా ప్రమాణం



--సుసంపన్న తెలంగాణను నిర్మిద్దాం: గవర్నర్

ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలంగాణ ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ''ప్రియమైన తెలంగాణ సోదర సోదరీమణులారా.. ఈ పదవీ బాధ్యతలు వినమ్రతతో, గౌరవ భావంతో స్వీకరిస్తూ.. ఇది నాకు గొప్ప సత్కారంగా భావిస్తున్నా. నాపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన రాష్ట్రపతి, ప్రధానమంత్రికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇక్కడి ప్రజలకు సేవ చేయడం గర్వంగా, అదృష్టంగా భావిస్తున్నా. తెలంగాణ అంటే గొప్ప సంప్రదాయాలు, అసాధారణ పురోగతికి నిదర్శనం. నేను హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన అనుభవం.. తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నా. ఈ ప్రాంతం.. ఆశలు, ఆవిష్కరణలు, సహనశక్తికి చిహ్నంగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వానికి, క్యాబినెట్ సభ్యులకు నా హృదయపూర్వక అభినందనలు. మనమందరం కలిసి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు.. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ లక్ష్యాలను గౌరవిస్తూ ముందుకు సాగుదాం. అందరం సమష్టిగా సుసంపన్నమైన తెలంగాణ రాష్ట్రాన్ని నిర్మించడానికి కలిసి పనిచేద్దాం. జై తెలంగాణ!'' అని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్



కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు భారాస ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జగదీశ్‌రెడ్డి, చింత ప్రభాకర్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దానం నాగేందర్‌పై భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ.. భారాస న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారించిన సుప్రీంకోర్టు.. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి మూడు నెలలు, తర్వాత మరో నాలుగు వారాలు, తాజాగా రెండు వారాల గడువు ఇచ్చింది. దాంతో స్పీకర్ పలు దఫాలుగా విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వారు తమ ఆధారాలను అఫిడవిట్ల రూపంలో స్పీకర్‌కు సమర్పించారు. పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. పార్టీ అగ్రనేతల సమక్షంలో ఆ పార్టీలో చేరారు' అని పేర్కొంటూ అందుకు సంబంధించిన ఆధారాలను ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు అఫిడవిట్లలో అందించారు. దీనికి సమాధానంగా.. 'మేము పార్టీ మారలేదు. ఇప్పటికీ భారాస సభ్యులుగానే కొనసాగుతున్నాం. మమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగానే ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశాం' అని ఎమ్మెల్యేలు తమ అఫిడవిట్లలో పేర్కొన్నారు. పలు దఫాలుగా జరిగిన విచారణలో ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలను స్పీకర్ ముందు వినిపించారు. ఇంతక్రితం 8 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సభాపతి తీర్పు వెల్లడించారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, ఎం.సంజయ్‌లు పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవని పేర్కొంటూ స్పీకర్ ఆ పిటిషన్లను డిస్మిస్ చేశారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లపై వాదనలు పూర్తయినా.. స్పీకర్ తీర్పును రిజర్వులో ఉంచారు. అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ఈనెల 12తో(గురువారం) ముగియనుంది. ఈ నేపథ్యంలో బుధవారం అసెంబ్లీలో సభాపతి వీరిద్దరిపై దాఖలైన పిటిషన్లలో కూడా తీర్పులను ప్రకటించారు. మొత్తం తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు సమర్పించనుంది.

## వెయ్యి ఇళ్లు కూలగొట్టి.. 310 మందికే నివాస స్థలాలా?




ఇద్దరు పెద్దలు 62 ఎకరాలను భూదాన్ బోర్డుకు ఇచ్చారు. అందులో 31 ఎకరాలను గతంలోనే కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారు. మిగిలిన భూమిలో చట్టబద్ధంగా పట్టాలు పొంది, గత పదేళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను ఇప్పుడు కూల్చివేయడం ప్రభుత్వ వినాశకర ఆలోచనకు నిదర్శనం. కాంగ్రెస్ మంత్రుల విల్లాలకు వ్యూ అడ్డం వస్తుందని, మంత్రుల బినామీలైన కొందరు తమ రియల్ ఎస్టేట్ లాభాల కోసం ఈ విధ్వంసం సృష్టించారు. ఒక శత్రు దేశం మీద దండయాత్రకు వెళ్లినట్లు 3,000 మంది పోలీసులతో తెల్లవారుజామున వెళ్లి.. ఆడబిడ్డలు వేడుకుంటున్నా కనికరించకుండా ఇళ్లను నేలమట్టం చేయడం అమానుషం. బాధితులను 'పెయిడ్ ఆర్టిస్టులు' అని మంత్రులు అవమానించడం తగదు. ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నవాళ్లే అసలైన పెయిడ్ ఆర్టిస్టులు. బాధితులకు భోజనం పెడుతున్న భారాస నాయకులపై అక్రమ కేసులు బనాయించారు. బాధితులను కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురిచేశారు. తక్షణమే ఆ కేసులను ఉపసంహరించుకోవాలి. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు భారాస పోరాటం ఆపదు'' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ



ఈ కబురు ;

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిలో తలెత్తిన ఉద్రిక్తతలు ప్రపంచ వాణిజ్యానికి ఉరితాడుగా మారే ప్రమాదం ఉందని ఐక్యరాజ్యసమితి జారీ చేసిన తాజా హెచ్చరిక ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఇజ్రాయెల్‌అమెరికా దాడులు, దానికి ప్రతిగా ఇరాన్ ప్రతీకార చర్యలతో ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఈ సముద్ర మార్గం గుండా నౌకల రాకపోకలు ఏకంగా 97 శాతం పడిపోవడం ఒక భయంకరమైన వాస్తవాన్ని కళ్లకు కడుతోంది.

హోర్ముజ్ జలసంధి అనేది కేవలం ఒక నీటి మార్గం కాదు, అది ప్రపంచానికి శక్తినిచ్చే 'ధమని'. ప్రపంచ చమురు వాణిజ్యంలో నాలుగో వంతు, గణనీయమైన మొత్తంలో ఎల్ఎన్‌జీ, ఎరువులు ఈ సన్నని జలసంధి ద్వారానే రవాణా అవుతాయి. యూఎన్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ నివేదిక ప్రకారం, ఈ మార్గంలో అంతరాయం కలగడం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఇంధనం, రవాణా, ఆహార ధరలు,ఆకాశాన్ని తాకడమే. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి, గ్యాస్ ధరలు పెరిగితే ఎరువుల ధరలు పెరుగుతాయి, వెరసి ఇవన్నీ కలిసి సామాన్యుడి కంచంలోని ఆహార ధరలను పెంచి, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తాయి.అంకెలు చూస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈ మార్గం గుండానే వెళ్లాలి. అందులో 84 శాతం ఆసియా దేశాల అవసరాలకే ఉద్దేశించబడింది. అంటే, ఈ జలసంధి మూతపడితే ఆసియా ఖండంలోని ఇంధన భద్రతకు ప్పకూలే ప్రమాదం ఉంది. ఒక వారం ముందు వరకు ఈ మార్గం గుండా వెళ్లిన భారీ నౌకలు, దాడులు ప్రారంభమైన నాటి నుంచి కనిపించకుండా పోయాయి. బీమా ప్రీమియంలు పెరగడం, ఓడల రాకపోకలకు ముప్పు ఉండటంతో సరఫరా గొలుసు పూర్తిగా ఛిన్నాభిన్నమైంది.అప్పుల భారంతో కునారిల్లుతున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ 'ప్రైస్ షాక్' కోలుకోలేని దెబ్బ కానుంది. ఇప్పటికే ఆర్థిక వనరులు లేక ఇబ్బంది పడుతున్న ప్రభుత్వాలపై, గృహ బడ్జెట్‌లపై ఈ ధరల పెరుగుదల అదనపు ఒత్తిడిని పెంచుతుందని యు ఎన్ సి టీ ఏ డి హెచ్చరించింది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ, నావిగేషన్ స్వేచ్ఛను పునరుద్ధరించకపోతే, ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచాన్ని మరో భారీ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఉద్రిక్తతలు తగ్గించి, సురక్షిత వాణిజ్య మార్గాలను కాపాడటమే ఇప్పుడు ప్రపంచ దేశాల ముందున్న తక్షణ కర్తవ్యం.

ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ కూటమి మధ్య యుద్ధం 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం ( బీడీఎస్సీ )పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం. బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణి ఛత్రాన్ని విప్పింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. అలాగే, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి.యుద్ధం ఆపకపోతే గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐ ఆర్ జి సి ) హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిలో మైన్లను (మందుపాతరలు) అమర్చి షిప్పింగ్‌ను నిలిపివేసేందుకు ఇరాన్ యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఒకవేళ చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకుంటే, ఎన్నడూ చూడని రీతిలో ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. చమురు మార్గంలో మైన్లను అమర్చేందుకు సిద్ధంగా ఉన్న ఇరాన్‌కు చెందిన 16 నౌకలను అమెరికా నావికా దళం ఇప్పటికే ధ్వంసం చేసింది. ఇంధన సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా అమెరికా ఈ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయాలని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దాడి కోసం ఈ సంస్థల సాంకేతికతను ఉపయోగిస్తున్నందున వీటిని లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్జీసీ అనుబంధ వార్తా సంస్థ తస్నిం న్యూస్ ఏజెన్సీ తెలిపింది. ప్రముఖ సెర్చింజన్ సంస్థ గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్‌విడియా, ఒరాకిల్, పాలంటీర్ వంటి టెక్ సంస్థలు, గల్ఫ్ దేశాల్లో క్లౌడ్ ఆధారిత సేవలు అందిస్తున్న కొన్ని కార్యాలయాలు ఈ జాబితాలో ఉన్నట్లు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు సంబంధించిన బ్యాంకులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంది. ఇందుకోసం శత్రువులు తమకు స్వేచ్ఛ కల్పించారని అన్నారు. ఆయా ప్రదేశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రజలు ఉండవద్దని ఇరాన్ హెచ్చరించింది.

--యుద్ధంలో గాయపడినట్లు అంగీకరించిన ఇరాన్ ప్రభుత్వ మీడియా

పాత ఫొటోలు, ఏఐ చిత్రాలతో నెట్టుకొస్తున్న ప్రభుత్వ ఛానళ్లుఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఆచూకీపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారి కూడా ప్రజల ముందుకు రాకపోవడం, కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొనసాగుతున్న యుద్ధంలో ఆయన గాయపడ్డారని వార్తలు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో ఆయన పరిస్థితిపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. సోమవారం ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ మొజ్తబా గాయపడినట్లు అంగీకరించింది. ఆయన్ను "జాన్‌బాజ్ ఆఫ్ రంజాన్" (గాయపడిన యుద్ధ వీరుడు) అని అభివర్ణించింది. అయితే, ఈ గాయం ఎప్పుడు, ఎక్కడ, ఎలా తగిలింది, దాని తీవ్రత ఎంత అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ గాయం కారణంగా ఆయన తన అధికారిక బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నారా? లేదా? అనే విషయంపై కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో మిస్టరీ మరింత పెరిగింది.జెరూసలేం పోస్ట్ తన కథనం ప్రకారం అంతర్గత వర్గాల సమాచారం మేరకు మొజ్తబా యుద్ధంలో గాయపడింది నిజమే అయినప్పటికీ, ఆయన దేశ వ్యవహారాలను చక్కదిద్దే స్థితిలోనే ఉన్నారని తెలుస్తోంది. అయినప్పటికీ, నాయకత్వ మార్పు సజావుగా జరిగిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, ఇప్పటివరకు మొజ్తబాకు సంబంధించిన ఒక్క కొత్త ఫొటో గానీ, వీడియో గానీ విడుదల కాలేదు. ప్రభుత్వ ఛానళ్లు ఆయన పాత ఫుటేజ్‌ను, కొన్ని సందర్భాల్లో ఏఐజెనరేటెడ్ చిత్రాలను ఉపయోగించి అంతా సవ్యంగా ఉందని చూపించే ప్రయత్నం చేస్తున్నాయి.ఈ పరిణామాలపై ఇరాన్ ప్రభుత్వ వ్యతిరేకులు, పరిశీలకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొజ్తబా ప్రజల ముందుకు రాకపోవడం వెనుక బలమైన కారణం ఉందని వారు అనుమానిస్తున్నారు. సోషల్ మీడియాలో కొందరు ఆయన గాయాలతో మరణించి ఉండవచ్చని కూడా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం దేశాన్ని నడిపిస్తున్నది ఎవరు? తెర వెనుక నిజమైన అధికారం ఎవరి చేతిలో ఉంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొజ్తబాను కేవలం ఒక ఉత్సవ విగ్రహంగా ఉంచి, పాలనా వ్యవస్థలోని మరో సీనియర్ అధికారి అధికారాన్ని చెలాయిస్తున్నారని ప్రతిపక్ష వర్గాలు ఆరోపిస్తున్నాయి. దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాలను శాసించిన సుప్రీం లీడర్ అలీ ఖమేనీ కుమారుడే ఈ మొజ్తబా ఖమేనీ. ఆయనకు అధికారిక పదవులు లేనప్పటికీ, తెరవెనుక దేశ రాజకీయ, భద్రతా వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని విశ్లేషకులు భావిస్తారు.

## సవాళ్లకు అనుగుణంగా సైన్యాన్ని మార్చడమే లక్ష్యం



సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హయ్యర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరుతున్న అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న పాఠాలకు అనుగుణంగా భారత్ ఇప్పుడు స్పందించే స్థితి నుంచి ముందస్తు చర్యలు చేపట్టే వ్యూహానికి మారిందని తెలిపారు. భవిష్యత్తులో యుద్ధాలు మల్టీ డొమైన్ ఆపరేషన్లు, డేటా సెంట్రిక్ యుద్ధం, మానవరహిత వ్యవస్థలపై ఆధారపడి ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి 'భైరవ్ బెటాలియన్, స్పెషల్ ఆపరేషన్స్ ఫోర్సెస్ బ్రిగేడ్' వంటి కొత్త విభాగాలను ఏర్పాటు చేశామని వివరించారు.

## పశ్చిమాసియా యుద్ధ పర్యవసానాల్ని ఎదుర్కొంటాం తిరుచ్చి ఎన్డీయే సభలో ప్రధాని మోదీ



–రెండు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రారంభం

ఎన్డీయే సభకు ముందు తిరుచ్చిలోని అధికారిక కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.5,655 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నాగర్‌కోయిల్-చర్లపల్లి, పోదనూర్(కోయంబత్తూర్)-ధన్‌బాద్ అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, రామేశ్వరం-మంగళూరు, తిరునెల్వేలి-మంగళూరు, మయిలాడుదురై-తిరువారూర్-కారైకుడి ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో నాగర్‌కోయిల్-చర్లపల్లి అమృత్‌భారత్ రైలు(06357) నెల్లూరు, గుంటూరు మార్గంలో వెళ్లనుండగా.. పోదనూర్(కోయంబత్తూర్)-ధన్‌బాద్ అమృత్‌భారత్ రైలు(06619) రేణిగుంట, నెల్లూరు, విజయవాడ, దువ్వాడ, విజయనగరం మార్గంలో ఝార్స్‌గూడ వెళ్లనుంది. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ఎల్.మురుగన్, తమిళనాడు రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి, ఇతర కూటమి పార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లు



ఈ కబురు, హైదరాబద్ : ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కాలుష్య రహిత రవాణా లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంలోని ఏ శాఖ అయినా ఇక నుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై బుధవారం రివ్యూ నిర్వహించారు. హైదరాబాద్ నగరం నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్లను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడానికి కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలన్నారు. ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లుంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలన్నారు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు పూర్తి చేయాలని, అవసరమైన కొత్త నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర టిమ్స్‌లాంటి పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలన్నారు.

--హైస్పీడ్ రైలు కారిడార్ సమీపంలో బస్ టెర్మినల్

క్యూర్ పరిధిలోని ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రవాణా శాఖలో మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. ఆర్‌టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్ కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ స్పెషల్‌సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్' నిర్వాసితులు ఆత్మగౌరవంతో బతకాలి



ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల (వినోబాభావేనగర్) భూదాన్ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను సీసీఎల్ఏ, హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఫిబ్రవరి 24న తొలగించిన విషయం విదితమే. నిర్వాసితుల్లో అర్హత గల కుటుంబాలకు అదేచోట ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారులకు స్థలం, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఉపముఖ్యమంత్రి బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. వెలుగుమట్లలో నిరుపేదల నిస్సహాయతను ఆధారంగా చేసుకొని ఏర్పడిన మాఫియా డబ్బులు దండుకొని సమాంతర వ్యవస్థను నడిపిందని దుయ్యబట్టారు. 412 మంది లబ్ధిదారులను గుర్తించామని, అందులో స్థలం లేని 311 మందికి భూమితోపాటు ఇందిరమ్మ ఇళ్లు, మిగిలిన 101 మందికి వారి సొంత గ్రామాల్లో స్థలం ఉండటంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే ప్రాంతాన్ని మోడల్ కాలనీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పటంతో ముగ్గురు మంత్రులం ఇక్కడికి వచ్చామని పేర్కొన్నారు. పదేళ్లు పాలించి రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామంటూ మోసగించినవారు నిబద్ధత కలిగిన తమ ప్రభుత్వాన్ని ఆక్షేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

--హామీని నిలబెట్టుకున్నాం

ఈ నెల 1న ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు పట్టాలిచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దొరల పాలనలో వెలుగుమట్లలో 2017 నుంచి కనీస వసతులు లేక నిరుపేదలు ఇబ్బందులు పడ్డారన్నారు. నాడు ఇళ్లను కూల్చేందుకు ప్రయత్నిస్తే.. బాధితులు అడ్డుకోవటంతో వెళ్లిపోయారని గుర్తుచేశారు. అప్పుడు పేదల బాగోగులు పట్టనివారు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు.

--నిరుపేదలకు భూదాన్ భూములు దక్కాలి

గత పాలకులు వెలుగుమట్లలోని పేదలను పట్టించుకోలేదని, వసతులు కల్పించలేదని మంత్రి తుమ్మల ఆరోపించారు. నిరుపేదలకు భూదాన్ భూములు దక్కాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని, అందుకే కూలగొట్టినచోట స్థలంతోపాటు ఇళ్లు నిర్మించి స్వేచ్ఛాజీవితం అందిస్తామని చెప్పారు.

--21 మంది నిందితుల అరెస్టు: సీపీ

వెలుగుమట్లలో 1953లో 147, 148, 149 సర్వే నంబర్లలోని 31.07 ఎకరాల భూమిని కె.వెంకట రాజారామారావు దానం చేశారని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. తీన్‌సాల్ పహాణీలోనూ అంతే విస్తీర్ణం ఉందని స్పష్టంచేశారు. 2014 నుంచి ఇక్కడ ఇళ్ల స్థలాల పేరిట మోసగించి రూ.3 కోట్లు దండుకున్నారని, 21 మంది నిందితులను అరెస్టు చేశామని సీపీ సునీల్‌దత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కార్పొరేషన్ల ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్....



సమావేశంలో పాల్గొన్న హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు, నిర్వాహకులు



కమర్షియల్ గ్యాస్ సిలిండర్



Reg No: 478/2020

IT Corridor Hostel Association

IMPORTANT MESSAGE

Dear All,

Due to the ongoing US, Israel, and Iran war, we are currently facing a gas cylinder shortage from today onwards. To reduce gas consumption and manage the situation, we request all hostel owners to follow the below guidelines until the situation improves:

- Tea and coffee may not be served temporarily.
- Chapathi, Dosa, Puri, and other time-consuming or high oil-consumption breakfast items will be avoided.
- Depending on the situation and scarcity, some curries and extra food items may be temporarily stopped.
- Food items like rice and other basic meals will be served until the gas shortage situation improves.
- Self-cooking facilities will be temporarily stopped.

We request all hostel owners to implement alternate cooking methods and kindly inform guests about the situation.

Thank you for your cooperation.

IT Corridor Hostel Association

Indira Nagar, Opp UCO Bank, Gachibowli, Hyderabad - 32

హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విడుదల చేసిన నోటీసు

- ఐటి కారిడార్ హాస్టళ్లకు గ్యాస్ కష్టాలు
- ప్రైవేటు హాస్టళ్ల ఫుడ్ మెనూలో కోతలు
- టీ, కాఫీలు, ఆయిల్ టిఫిన్లు బంద్...
- భోజనంలో కూరలు సైతం మితంగానే..

ఈకబురు, శేరిలింగంపల్లి : పశ్చిమాసియా యుద్ధం ఎఫెక్ట్ నగరంపై ప్రభావం చూపిస్తుంది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరతతో ఐటీ కారిడార్ కు గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. ఐటి కారిడార్ లో ఉద్యోగాలు చేస్తున్న లక్షలాది మంది ప్రైవేటు హాస్టళ్లలో నివాసం ఉంటుండగా, గ్యాస్ కొరత కారణంగా ప్రైవేటు హాస్టళ్లు ఫుడ్ మెనూలో కోతలు విధిస్తున్నాయి. ప్రైవేటు హాస్టళ్లలో ఉండే వారికి రోజు ఉదయం, సాయంత్రం అందించే టీ, కాఫీలను బందు చేయడంతో పాటు ఆయిల్ లో వేయించే టిఫిన్లను సైతం నిలిపివేస్తున్నట్లు హాస్టళ్ల ముందు బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు భోజనంలో సైతం అన్నం, పప్పు వంటి పరిమిత ఆహారం మాత్రమే అందజేస్తామని ప్రకటించారు. మరో రెండు రోజుల్లో గ్యాస్ సరఫరా మెరుగువడకపోతే ప్రైవేటు హాస్టళ్లలో కిచెన్లను మొత్తం బంద్ చేయడమేనని నిర్వాహకులు వాపోతున్నారు. గ్యాస్ సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందుల కారణంగా ఐటి కారిడార్ పరిధిలోని ప్రైవేటు హాస్టళ్లలో నివాసం ఉంటున్న లక్షలాది మంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఫుడ్ మెనూలో కోతలపై అన్ని హాస్టళ్ల ముందు బోర్డులు ఏర్పాటు చేయగా, బుధవారం గచ్చిబౌలిలో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ ఇబ్బందులను వెల్లడించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అమర్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్ ఇరాక్ యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరా నిలిచిపోయిందన్నారు. గత వారం రోజులుగా గ్యాస్ సరఫరా 80శాతం పడిపోయిందని, రోజుకు 100 సిలిండర్లు అవసరం అయ్యే చోట 20 సిలిండర్లు మాత్రమే అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. దీంతో పాటు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్ ప్రారంభమయ్యిందని, 2,110 రూపాయలు ఉన్న సిలిండర్ ను బ్లాక్ లో 3వేల నుంచి 3500 రూపాయలకు విక్రయిస్తున్నారని వాపోయారు. నగరంలో దాదాపు 11వేల హాస్టళ్లు ఉన్నాయిని, వీటిలో సుమారు 10 లక్షల మంది నివాసం ఉంటున్నారన్నారు. గ్యాస్ కొరత కారణంగా హాస్టళ్లలో నివాసం ఉండే వారికి పూర్తి స్థాయిలో ఆహారం అందించలేకపోతున్నామని వాపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని హాస్టళ్ల నిర్వాహకులతో చర్చించిన అనంతరం అసోసియేషన్ పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.

**ఫుడ్ మెనూలో కోతలు....**

కమర్షియల్ సిలిండర్ల కొరత కారణంగా ఐటి కారిడార్ పరిధిలోని ప్రైవేటు హాస్టళ్లలో ఫుడ్ మెనూలో కోతలు పెడుతున్నట్లు ప్రకటించారు. ఈమేరకు అన్ని హాస్టళ్ల ముందు ఇప్పటికే బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. రోజు ఉదయం, సాయంత్రం ఇచ్చే టీ, కాఫీలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు ఎక్కువ గ్యాస్ వినియోగం అయ్యే అయిల్ టిఫిన్లు దోశ, పూరి, చపాతీ, వడ వంటి టిఫిన్లను నిలిపి చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి అందించే భోజనంలో అన్నం, పప్పు వంటి సాదారణ మెనూను అందజేస్తామన్నారు. మరో రెండు రోజుల్లో హాస్టళ్లలో ఉన్న గ్యాస్ నిల్వలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని, ఇదే జరిగితే కిచెన్లను మొత్తం బంద్ చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ప్రైవేటు హాస్టళ్లకు ఇచ్చే సిలిండర్లను కమర్షియల్ విభాగం నుంచి గృహఆవసర విభాగంలోకి మార్చాలని కోరారు. ప్రభుత్వాలు గ్యాస్ డిస్ట్రిబూటర్లతో మాట్లాడి హాస్టళ్లకు నిరంతర గ్యాస్ సరఫరా జరిగే విధంగా చూడాలని అన్నారు. ఇప్పటికే పలు నగరాల్లో హోటళ్లు, హాస్టళ్ల కిచెన్లు మూసివేశారని, హైదరాబాద్ నగరంలో సైతం అటువంటి పరిస్థితులు రాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు తాతా కరుణాకర్, మహిధర్, జయరామ్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మధు, సూర్య కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**కట్టెల కోసం పరుగులు....**

కాగా ఐటి కారిడార్ కు అనుకొని ఉన్న గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, అంజయ్య నగర్ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులు గ్యాస్ కొరతను అధిగమించేందుకు కట్టెల కోసం పరుగులు పెడుతున్నారు. గ్యాస్ సిలిండర్ల సరఫరా పూర్తిగా నిలిచిపోతే అత్యవసరం కోసం కట్టెల పొయ్యి మీద వంటలు చేసేందుకు హాస్టల్ నిర్వాహకులు కట్టెలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు హాస్టళ్ల నిర్వాహకులు కట్టెలను కొనుగోలు చేసి పెట్టుకోగా, పలువురు కట్టెల కోసం టింబర్ డిపోల చుట్టూ తిరుగుతున్నారు.

# ఎంత వరదొచ్చినా తట్టుకునేలా రక్షణ గోడ

హైదరాబాద్ మహానగరానికే తలమానికంగా ఉండేలా చేపట్టనున్న మూసీ పునరుజ్జీవ పథకం మొదటి దశ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) పూర్తి కావడంతో దీనిపై అన్ని రంగాల నిపుణులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించి ప్రభుత్వం ముందడుగు వేయనుంది. మొదట హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు, గండిపేట నుంచి గాంధీసరోవర్ వరకు సుమారు 21 కి.మీ.ల పునరుజ్జీవానికి సుమారు రూ.7 వేల కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభించనుంది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నగరాలకు దీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సమగ్ర చర్చతో ఈ ప్రాజెక్టుపై ముందుకెళ్లనున్నారు. పనులు పూర్తయితే నగరం నడిబొడ్డున నిత్యం మంచినీటితో ప్రవహించే నది, ప్రకృతి అందాలు నగరవాసులకు కనువిందు చేస్తాయి. రోజంతా నడిచే హోటళ్లు, షాపింగ్‌మాల్స్, ఆకాశాన్ని తాకే ఎత్తైన భవనాలు, విద్యుద్దీపకాంతులతో మూసీ పరీవాహక ప్రాంతం రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మారనుంది. వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆయా లక్ష్యాలతో ప్రభుత్వం ప్రాజెక్టుకు తుది రూపు ఇచ్చింది. త్వరలోనే ప్రాజెక్టు లక్ష్యాలను ప్రకటించి, తదుపరి కార్యాచరణను ప్రకటించేందుకు సిద్ధమవుతుంది.

--సియోల్‌లోని జుంగ్‌నాంగ్ తరహాలో...

మురుగు చేరకుండా నదికి ఇరువైపులా భారీ ట్రంక్‌లైన్ ఏర్పాటవనుంది. పైపులైన్లను మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీల)కు అనుసంధానం చేస్తారు. ప్రస్తుతం రెండు దశల్లోనే మురుగు శుద్ధి జరుగుతోంది. ఇకపై మూడు దశల్లో శుద్ధి చేసి.. ఆ నీరును నిర్మాణ రంగం, పరిశ్రమలు, పచ్చదనం పెంపునకు పునర్వినియోగిస్తామని అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే 4 ఎస్టీపీల్లో ఒకదానిని ప్రత్యేకంగా భూగర్భంలో నిర్మించనున్నారు. దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఉన్న జుంగ్‌నాంగ్ అండర్‌గ్రౌండ్ ఎస్టీపీసియోల్ సైన్స్ మ్యూజియం తరహాలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. పైభాగంలో అందమైన పార్కు, నీటి కొలను, క్రీడా మైదానం ఉంటాయి.

--మాస్టర్‌ప్లాన్..

నగరంలో మూసీ జంట జలాశయాల నుంచి తూర్పున ఉన్న గౌరెల్లి గ్రామం వరకు నది 55కి.మీ పొడవున ప్రవహిస్తుంది. దానికి ఇరువైపులా కిలోమీటరు ప్రాంతాన్ని కలిపి ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తోంది. మొత్తంగా 110.91 చ.కి.మీ. పరిధికి బృహత్తర ప్రణాళిక రాబోతుంది.

--ఎక్కడెక్కడ.. ఏయే సౌకర్యాలంటే..

హైదరాబాద్‌లో 1908 సెప్టెంబరు 28న ఘోర విపత్తు చోటు చేసుకుంది. వరద మూసీ నదిని ముంచెత్తింది. వేల మంది చనిపోయారు. అంతటి విపత్తు మళ్లీ వచ్చినా.. నగరానికి ఎలాంటి నష్టం తలెత్తకుండా ఎంఆర్‌డీసీఎల్ (మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ప్రణాళికను రూపొందించింది. హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 9.2 కి.మీ. ఈసీ నది, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 11.8 కి.మీ. మూసీ నదికి ఇరువైపులా లక్షన్నర క్యూసెక్కుల ప్రవాహం వచ్చినా



తట్టుకునేలా భారీ రక్షణ గోడలు నిర్మిస్తారు. గోడకు ఒక వైపున వంద అడుగుల రోడ్డు, మూసీఈసీ నదుల మధ్యనున్న భూభాగం వైపున 60అడుగుల రోడ్డును అభివృద్ధి చేస్తారు. మొత్తం 50 మీటర్ల బఫర్ జోన్‌లో 60 అడుగులు రోడ్డుకు పోతే, మిగిలిన భూమిని పార్కుల కోసం ఉపయోగిస్తారు.

మంచిరేవుల, నార్సింగి, సన్‌సిటీ, తదితర ప్రాంతాలకు మూసీ, ఈసీలపై 15 చోట్ల వంతెనలు రానున్నాయి. బాపూఘాట్ వరకు నది పరీవాహక ప్రాంతమంతా పచ్చిక బయళ్లు, పూల తోటలతో అభివృద్ధి చేయనున్నారు. వాటి మధ్యనే పిల్లలు ఆడుకునే పార్కులు, నడకదారులు, సైకిల్ ట్రాక్‌లు, హోటళ్లు ఉంటాయి. జంట జలాశయాల నుంచి తూర్పున ఓఆర్ఆర్ వరకు ఈస్ట్‌వెస్ట్ కారిడార్‌ను కలుపుతూ విశాలమైన రోడ్డు మార్గాలను నిర్మించాలన్నది ప్రాజెక్టు లక్ష్యం. ప్రస్తుతం మొదటి దశలో బాపూఘాట్ వరకు భూమిపై గరిష్ఠ వరద ప్రవాహ మట్టానికి తగినంత ఎత్తున రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. బాపూఘాట్ నుంచి ఎలివేటెడ్ కారిడార్ (ఫ్లైవంతెన)ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

--'గాంధీ సరోవర్' ఇలా..

ప్రస్తుత బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ కేంద్రం రాబోతుంది. మూసీ, ఈసీ, గోదావరి జలాలు కలిసే త్రివేణి సంగమం వద్ద నదుల మధ్యలో ఉన్న భూమిలో 100 మీటర్ల టవర్‌ను నిర్మించి, దానిపై ప్రపంచంలో ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని (స్టాచ్యూ ఆఫ్ పీస్) ఏర్పాటు చేయనున్నారు. కిందనున్న టవర్‌లోని పలు అంతస్తుల్లో గాంధీ జీవన ప్రయాణాన్ని తెలిపే బొమ్మలు, వస్తువులు, ఫొటోలతో మ్యూజియం కొలువుదీరుతుంది. 'లండన్ ఐ'ను తలపించే భారీ రంగుల రాట్నం, గాంధేయవాద విశ్వవిద్యాలయం, ప్రపంచ స్థాయి చర్చా వేదికలు నిర్వహించుకునే సెమినార్‌హాల్ నిర్మాణమవుతాయి.

# సంక్షోభ స్థాయికి వంటగ్యాసు కొరత

ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయీ' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది.

--వాణిజ్య సిలిండర్లపై సమీక్షకు కమిటీ

నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నామని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది.

--గ్యాస్‌పై అబద్ధాలాడుతున్న మోదీ సర్కారు

గ్యాస్ కొరత విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది. వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా మోదీ సర్కారు అబద్ధమాడుతోందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌పీజీ కొరతపై సభలో చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు.

--గ్యాస్ కొరతతో రోడ్డున పడ్డ హాస్టళ్లు...

..హైదరాబాద్ కేపీహెచ్‌బీ హాస్టల్‌లో గ్యాస్ కొరతతో.. రోడ్డు మీదే వంటలు

అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా మొదలైంది. క్రూడ్ ఆయిల్, సీఎన్జీ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో సమాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే పలు హోటల్స్ మూతపడగా.. హాస్టల్స్ లో మెనూలో చాలా మార్పులు చేశారు. చివరికి గ్యాస్ లేక కట్టెల పొయ్యిపైన వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బుధవారం (మార్చి 11) హైదరాబాద్ లోని KPHB కాలనీలో గ్యాస్ లేకపోవడంతో రోడ్డుపైన కట్టెల పొయ్యిపైన వంటలు చేస్తుండటం గ్యాస్ కష్టాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. కేపీహెచ్‌బీ కాలనీలో ఉన్న హాస్టల్‌లో గ్యాస్ కొరత తీవ్ర సమస్యగా మారింది. హాస్టల్‌లో వంటకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో అక్కడి సిబ్బంది, నివాసితులు రోడ్డుపై తాత్కాలికంగా కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేశారు. రోడ్డుపైనే వంటలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. హాస్టల్‌లో ఉండే విద్యార్థులు, ఉద్యోగులు భోజనానికి ఇబ్బందులు పడుతుండటంతో నిర్వాహకులు ప్రత్యామ్నాయంగా బయట వంటలు ప్రారంభించారు. రోడ్డుపై వంటలు చేయడం వల్ల స్థానికంగా కొంత అసౌకర్యం కూడా ఏర్పడింది. గ్యాస్ సరఫరా త్వరగా పునరుద్ధరించాలని హాస్టల్‌లో నివసించే వారు కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు గ్యాస్ సమస్యతో హాస్టళ్లలో మెనూ పూర్తిగా మార్చేశారు నిర్వాహకులు. కేవలం రెండు పూటల మాత్రమే భోజనం అందించగలమని ప్రకటించారు. ఉదయం టిఫిన్స్, బ్రేక్ ఫాస్ట్ లు ఇవ్వడం వీలుకాదని చెప్పినట్లు పలు హాస్టల్లో ఉంటున్న బోర్డర్స్ తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే హాస్టళ్లు మూసివేసే పరిస్థితి ఉందని.. అదే జరిగితే కాలేజీలకు, ఉద్యోగాలకు ఎలా వెళ్లాలని ఆవేదని వ్యక్తం చేస్తున్నారు.

# స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాసం

ఆయన క్షమాపణలు చెప్పాలంటూ విపక్షాలు డిమాండ్ చేశాయి. పెద్దఎత్తున నినాదాలుచేస్తూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. ఈ పరిస్థితుల మధ్యనే ఓటింగు నిర్వహించి తీర్మానాన్ని తిరస్కరించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. విపక్షాల తీర్మానంపై మంగళవారం మొదలైన చర్చ.. రెండోరోజూ కొనసాగింది. రాహుల్‌గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు మాట్లాడుతూ ఎలాంటి ముఖ్యమైన అంశాన్ని సభలో తాము లేవనెత్తాలన్నా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నోటి నుంచి 'నో..నో..నో' అనే వస్తుందని విమర్శించారు.

--మోదీ రాజీ పడ్డారు: రాహుల్

సభలో తాము మాట్లాడడానికి లేచినప్పుడల్లా స్పీకర్ అడ్డుకుంటున్నారని విపక్షనేత రాహుల్ ఆరోపించారు. ''భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని మోదీ రాజీ పడ్డారు. దాని ఫలితం అందరికీ తెలుసు. దేశ చరిత్రలో మొదటిసారిగా, ఒక కీలక చర్చా సమయంలో ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వలేదు. భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రచించిన పుస్తకంపై చర్చ జరగకుండా చేశారు. లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నరవణె రాసిన విషయాలు చెప్పనివ్వకుండా చేశారు. అందుకే అవిశ్వాస తీర్మానం పెట్టాల్సి వచ్చింది'' అని చెప్పారు. ''ఇక్కడ జరుగుతున్న చర్చ ప్రజాస్వామ్య ప్రక్రియ, స్పీకర్ పాత్ర గురించి. కానీ చాలాసార్లు నా పేరు ప్రస్తావనకు వచ్చింది. నా గురించి అడ్డగోలుగా మాట్లాడారు. వాస్తవానికి ఈ సభ.. భారత ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం. ఇది కేవలం ఒక పార్టీకి మాత్రమే ప్రాతినిధ్యం వహించదు. నేను ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి లేవనెత్తాను. అదానీ అంశాన్నీ తెరపైకి తెచ్చాను. కానీ నా గొంతు నొక్కేశారు. ఇవి భారత ప్రజలు కచ్చితంగా తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశాలు'' అని వివరించారు. వివిధ పార్టీల సభ్యులు మాట్లాడుతూ స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయన హయాంలో ఒకేరోజు 140 మంది విపక్ష సభ్యులు సస్పెండయ్యారని గుర్తుచేశారు. అధికారపక్షం తమకు అనేకసార్లు అవాంతరాలు కలిగిస్తోందని చెప్పారు. వ్యక్తిగతంగా బిర్లాపై తమకు ద్వేషం లేదని, ప్రభుత్వంవైపు ఆయన నిలుస్తూ తమ గొంతు నొక్కేయడమే బాధాకరమని అన్నారు. ప్రభుత్వం ఆయన చేతుల్ని కట్టేస్తోందని విమర్శించారు.

--సభాపతి చిత్తశుద్ధినే శంకిస్తారా?: అమిత్‌షా

రెండ్రోజుల చర్చకు అమిత్‌షా సమాధానమిస్తూ.. విపక్షాలను తూర్పారబట్టారు. సభాపతి చిత్తశుద్ధినే శంకిస్తారా అని ప్రశ్నించారు. ''సభ కొన్ని సొంత నియమాలపై ఆధారపడి నడుస్తుందే తప్ప ఏ పార్టీయో రూపొందించేవాటిపై కాదు. నాలుగు దశాబ్దాల తర్వాత స్పీకర్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడం చిన్నవిషయమేమీ కాదు. స్పీకర్‌ను శంకించేలా విపక్షాలు వ్యవహరించడం దురదృష్టకర పార్లమెంటరీ రాజకీయం. గతంలో భాజపా సుదీర్ఘకాలం విపక్షంలో ఉన్నా ఏనాడూ ఏ స్పీకర్‌పైనా ఇలాంటి తీర్మానం తీసుకురాలేదు. సభాపతి.. తటస్థ కాపలాదారుడు. అధికార, విపక్షాలకు ఆయన ప్రతినిధి. ఈ తీర్మానం దురదృష్టకరం'' అని మండిపడ్డారు. ''రాహుల్‌ను సభలో మాట్లాడనివ్వడం లేదనేది వాస్తవం కాదు. కీలక సమావేశాల సమయంలో ఆయన విదేశాలకు వెళ్లిపోతుంటారు. బడ్జెట్ సహా కీలక చర్చల నుంచి ఉద్దేశపూర్వకంగా తప్పించుకుంటారు. ఎందుకంటే పార్లమెంటులో మాట్లాడాలని ఆయన కోరుకోరు. 17వ లోక్‌సభలో ఆయన హాజరు 51 శాతమే'' అంటూ వివిధ గణాంకాలను, రాహుల్ పర్యటించిన దేశాల పేర్లను వివరించారు. లోక్‌సభలో భాజపా కంటే కాంగ్రెస్‌కు ఆరు రెట్ల అధిక సమయం లభించిందన్నారు. ఆయన ప్రసంగం చివర్లో విపక్షాలు వెల్ వద్దకు వెళ్లి నిరసనలు తెలిపాయి. కించపరిచే వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ఒక నాయకుడి (రాహుల్ గాంధీ) అహాన్ని సంతృప్తి పరచడానికి ఇలాంటి తీర్మానాన్ని ఆయుధంగా వాడుకోకూడదని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ హితవుపలికారు. దేశ భద్రత అంశాలపై ప్రతిపక్ష నేత ఆచితూచి మాట్లాడాలని, పక్షపాత రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రధాని మోదీ ఎప్పుడూ రాజీపడలేదని చెప్పారు. తీవ్ర ఆరోపణలు, రుజువులుంటేనే స్పీకర్‌పై అవిశ్వాసం ప్రతిపాదించాలన్నారు.

# సీఈసీ తొలగింపునకు ఎంపీల సంతకాలు

అంటే లోక్‌సభలో నోటీసు ఇవ్వడానికి కనీసం 100 మంది సభ్యులు, రాజ్యసభలో ఇచ్చేందుకు 50 మంది సభ్యులు సంతకం చేయాలి. విపక్షాలు సుమారు 120 మంది లోక్‌సభ సభ్యుల నుంచి, 60 మంది రాజ్యసభ సభ్యుల నుంచి సంతకాలు సేకరించాయి. విపక్ష ఇండియా కూటమిలోని అన్ని పార్టీలకు చెందినవారితోపాటు కూటమిలో లేని ఆప్ ఎంపీలూ సంతకాలు చేశారు. గురువారం లేదా శుక్రవారం ఉభయ సభల్లోనూ వేర్వేరుగా వీటిని సమర్పించనున్నట్లు సీనియర్ ఎంపీ ఒకరు వెల్లడించారు. సీఈసీపై పార్లమెంటులో నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. అనేక సందర్భాల్లో, ముఖ్యంగా ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) కసరత్తులో అధికార భాజపాకి సీఈసీ కొమ్ముకాస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. దీంతోసహా ఏడు అభియోగాలను అవి మోపుతున్నాయి. విధినిర్వహణలో పక్షపాత ధోరణి, ఎన్నికల్లో అవకతవకలపై దర్యాప్తునకు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడటం, పెద్దఎత్తున ఓట్లను తొలగించడం వంటివి దీనిలో ఉన్నాయని తెలుస్తోంది.

--మూడింట రెండొంతుల మద్దతు ఉండాలి

సీఈసీ తొలగింపు తీర్మానం ఆమోదం పొందాలంటే ఆయా సభల్లో మొత్తం సభ్యుల్లో సగం మందికిపైగా, ఓటింగుకు హాజరైనవారిలో మూడింట రెండొంతుల మంది మద్దతు ఇవ్వాలి. ఉభయ సభల్లోనూ ఒకేరోజు నోటీసు ఇచ్చి, వాటిని సభల్లో అనుమతించేవరకు ఎలాంటి కమిటీ ఏర్పాటుకాదు. నోటీసు ఆమోదం పొందాక స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ కలిసి ముగ్గురితో సంయుక్త సంఘాన్ని నియమిస్తారు. అభిశంసన కారణాలను కమిటీ విచారిస్తుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి/ న్యాయమూర్తి; దేశంలోని ఏదోఒక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఎవరైనా ప్రముఖ న్యాయకోవిదుడు దీనిలో ఉంటారు. కోర్టు మాదిరిగానే నిందితుడిని, సాక్షుల్ని వీరు విచారిస్తారు. కమిటీ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టి చర్చ చేపడతారు. ఉభయసభలూ ఆమోదించాక అభిశంసన పూర్తవుతుంది. సభ ప్రవేశద్వారం వద్ద నిలబడి సీఈసీ కూడా తనను తాను సమర్థించుకునే అవకాశం కల్పిస్తారు. తాను వైదొలగుతున్నట్లు గానీ ఆయన ప్రకటిస్తే దానినే రాజీనామాగా పరిగణిస్తారు. అప్పుడు ఆయనకు పింఛన్, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. పార్లమెంటే ఆయన్ని తొలగిస్తే మాత్రం ఇవి రావు.

# చమురులో కాలేసిన అమెరికా



ఈ కబురు, వాషింగ్టన్: అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ ప్రతిస్పందన విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన సలహాదారుల లెక్కలు తప్పాయి. ఇరాన్‌లో అధికార మార్పిడి ముందు యుద్ధం కారణంగా తలెత్తే సమస్యలు పెద్దవేమీ కాదనుకున్న వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఫలితంగా ప్రపంచ దేశాలు చమురు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వ్యూహాత్మక చమురు నిల్వలను బయటకు తీయాల్సి వస్తోంది.

--ఆనాడే ఆలోచించి ఉంటే..

ఇరాన్‌పై దాడులు చేయాలా.. వద్దా అనే సందిగ్ధంలో అధ్యక్షుడు ట్రంప్ ఉన్నప్పుడు.. దాడుల కారణంగా చమురుపై ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఇంధనశాఖ మంత్రి క్రిస్ వైట్ స్పష్టం చేశారు. యుద్ధంవల్ల పశ్చిమాసియాలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగబోదని, ఇంధన మార్కెట్లలో సంక్షోభం తలెత్తదని ధీమాగా చెప్పారు. గత ఏడాది జూన్‌లో ఇరాన్‌పై దాడులు చేసినప్పుడు స్వల్పంగా ఇంధన మార్కెట్లో ఒడిదొడుకులు చోటుచేసుకున్నాయని, ఆ తర్వాత వెంటనే సర్దుకున్నాయని ఉదహరించారు. కొంత మంది ట్రంప్ సలహాదారులూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రెండోసారి దాడులు చేస్తే ఆర్థిక వ్యవస్థలను ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశముందన్న హెచ్చరికలను కొట్టిపారేశారు.

--ఆందోళనలే నిజమయ్యాయ్

చమురు రవాణాను ఇరాన్ అడ్డుకుంటుందనే కొంత మంది ఆందోళనలే ఇప్పుడు నిజమయ్యాయి. హర్మూజ్ జల సంధిని ఆ దేశం మూసివేసింది. గతం కంటే ఈసారి రవాణా నౌకలపై భారీగా దాడులకు దిగుతోంది. దీంతో పర్షియన్ గల్ఫ్‌లో రవాణా పూర్తిగా స్తంభించింది. చమురు ధరలు పెరిగాయి. అమెరికన్లపై చమురు ధరల భారాన్ని తగ్గించడానికి ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. యుద్ధంపై చట్టసభ సభ్యులకు మంగళవారం ప్రభుత్వం వివరణ ఇచ్చాక కనెక్టికట్ డెమోక్రాట్ సెనేటర్ క్రిస్టోఫర్ ఎస్ మర్ఫీ ఎక్స్ వేదికగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. హర్మూజ్ జల సంధిపై ట్రంప్ ప్రభుత్వానికి ఒక ప్రణాళిక అంటూ లేదని, దానిని తెరిపించడానికి ఏం చేయాలో తెలియదని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ యంత్రాంగంలోని కొంత మంది అధికారులూ యుద్ధంపై నిరాశావాదంతోనే ఉన్నారు. అయితే వారు బహిరంగంగా స్పందించడం లేదు. హర్మూజ్ నుంచి నౌకలను అడ్డుకోవడానికి ఇరాన్ సీమైన్లను అమరుస్తోంది. దీంతో అమెరికా వాటిని అమర్చే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయాల్సి వచ్చింది. ప్రతిగా ఇరాన్.. నేరుగా రవాణా నౌకలను లక్ష్యంగా చేసుకుంటోంది. ఇది యుద్ధ తీవ్రతను మరింత పెంచింది.

## మహిళల రక్షణకు BSNL 'కవచ్'.. నంబర్ చెప్పకుండానే రీఛార్జ్!




మహిళల కోసం బీఎస్ఎన్ఎల్ (BSNL) సరికొత్త ఫీచర్ అందుబాటులోకి తీసుకొచ్చింది. గోప్యతను కాపాడటమే లక్ష్యంగా 'కవచ్' (Kavach) పేరుతో ప్రవేశపెట్టిన ఈ ఫీచర్ ద్వారా ఇకపై మహిళలు ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో తమ ఫోన్ నంబర్‌ను చెప్పకుండానే రీఛార్జ్ చేసుకోవచ్చు. దేశంలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులోకి తెచ్చిన ఈ ఫీచర్ ద్వారా మహిళల ఫోన్ నంబర్లను ప్రైవేటుగా ఉంచేందుకు దోహదపడటంతో పాటు అనవసరమైన ఫోన్ కాల్స్ లేదా నంబర్ దుర్వినియోగం నుంచి రక్షణ కల్పిస్తుంది. (BSNL Kavach)

ఈ ఫీచర్ విశేషాలివే..

'కవచ్' ద్వారా BSNL వినియోగదారులైన మహిళలు తమ అసలు ఫోన్ నంబర్‌కు లింక్ చేసే తాత్కాలిక 10 అంకెల నంబర్‌ను రూపొందించుకోవచ్చు. ఫీచర్ యాక్టివేట్ అయ్యాక ఈ తాత్కాలిక నంబర్ ఎస్సెమ్మెస్ రూపంలో వస్తుంది. దీన్ని ఏదైనా బీఎస్ఎన్ఎల్ అధీకృత రిటైల్ స్టోర్‌లో షేర్ చేయొచ్చు. అయితే, ఈ 10అంకెల నంబర్ శాశ్వతం కాదు.. ఓటీపీ మాదిరిగా ఎప్పటికప్పుడు మారుతుంది. అందువల్ల వినియోగదారులు తమ ఫోన్ నంబర్ రీఛార్జి చేయాలనుకున్న ప్రతిసారీ తాత్కాలిక నంబర్‌ని జనరేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఫీచర్ వల్ల ఆఫ్‌లైన్ రీఛార్జిల సమయంలో అదనపు రక్షణ లభించడం ద్వారా మహిళా వినియోగదారుల వ్యక్తిగత మొబైల్ ఫోన్ నంబర్‌లను ప్రైవేట్‌గా ఉంచుకోవచ్చు. టెలికాం కంపెనీలు తమ అధికారిక వెబ్‌సైట్‌లు, యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ రీఛార్జ్ సౌకర్యాలను అందిస్తున్నప్పటికీ, ఇంటర్నెట్ కనెక్టివిటీ పరిమితంగా ఉన్న లేదా డిజిటల్ చెల్లింపులు అంతగా లేని గ్రామీణ ప్రాంతాల్లో, టైర్ 3, టైర్ 4 నగరాల్లో నివసించే మహిళలకు ఈ కవచ్ ఫీచర్ ఉపయోగకరంగా ఉంటుంది.

'కవచ్' యాక్టివేషన్ ఎలాగంటే?

మీ ఫోన్ నుంచి 1800 180 1503 లేదా 1500 నంబర్‌కు కాల్ చేయండి.

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌తో కనెక్ట్ అయ్యేందుకు 9 బటన్ నొక్కండి. కవచ్ ఫీచర్ యాక్టివేట్ చేయాలని అడగండి.

సదరు ఎగ్జిక్యూటివ్ ఇచ్చిన సూచనలను పాటిస్తే మీకు 10 అంకెల తాత్కాలిక నంబర్ వస్తుంది.

మీఫోన్ రీఛార్జ్ కోసం ఈ తాత్కాలిక నంబర్‌ను రిటైల్ స్టోర్‌లో ఇవ్వండి.

బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా కూడా కవచ్ ఫీచర్‌ని యాక్టివేట్ చేసుకోవచ్చు.

## మార్కెట్ క్రాష్.. 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలకు ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి బుధవారం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో నేటి ట్రేడింగ్‌లో దేశీయ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి (Stock Market Today). సెన్సెక్స్ ఒకదశలో 1000 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ 24వేల వద్ద కదలాడుతోంది. ఉదయం 11.50 గంటల సమయంలో సెన్సెక్స్ 943 పాయింట్లు క్షీణించి, 77,262 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 259 పాయింట్లు నష్టపోయి 24,002 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, అదానీ ఫార్మా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎంఅండ్ఎం, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో మన మదుపర్లు ఒత్తిడికి గురవుతున్నారు. దాంతో నిన్నటి లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఇక ఈ యుద్ధం త్వరలో ముగియొచ్చని ట్రంప్ చెప్పినప్పటికీ.. పశ్చిమాసియాలో దాడులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు ప్రభావం చూపించాయి. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపర్ల (FII) అమ్మకాలు కొనసాగుతున్నాయి. ముడిచమురు ధరలు మంగళవారం ఒక బ్యారెల్‌కు 10 శాతానికి పైగా తగ్గినా.. అస్థిరతలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి. భారత్ ప్రధానంగా దిగుమతులపై ఆధారపడటమే ఇందుకు కారణం. దీంతో నేటి ట్రేడింగ్‌లో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు.. తర్వాత ఒక శాతం మేర కుంగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 91.89గా ఉంది.

## రైల్వే కేటరింగ్‌కూ ఎల్‌పీజీ సెగ.. వెండర్లకు ఐఆర్‌సీటీసీ సూచనలు

దిల్లీ: దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా కమర్షియల్ సిలిండర్ల సరఫరా తగ్గడంతో హోటళ్లు, రెస్టారంట్లు మూతపడుతున్నాయి. తాజాగా ఈ ప్రభావం రైల్వే కేటరింగ్‌నూ తాకింది. దీంతో ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (IRCTC) వెండర్లకు కీలక సూచనలు చేసింది. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరింది.



రైల్వే స్టేషన్లలో ఉండే ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, జనాహార్ కేంద్రాలకు ఐఆర్‌సీటీసీ మార్చి 10న ఓ అడ్వైజరీ జారీ చేసింది. ఎల్‌పీజీకి తీవ్రమైన కొరత ఏర్పడిన వేళ ప్రత్యామ్నాయ వంట పద్ధతులను అనుసరించాలని అందులో పేర్కొంది. ఎల్‌పీజీకి బదులు మైక్రోవేవ్‌లు, ఇండక్షన్ స్టవ్‌లు వినియోగించాలని తెలిపింది. పాసింజర్ డిమాండ్‌కు అనుగుణంగా రెడీ టూ ఈట్ ఫుడ్ ఐటెమ్స్‌ను తగినంత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించింది.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వంటగ్యాస్ సరఫరా తగ్గింది. కృత్రిమ కొరతను నివారించడానికి కేంద్రం సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచింది. ముఖ్యంగా గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం చమురు కంపెనీలకు సూచించింది. దీంతో కమర్షియల్ సిలిండర్లకు కొరత ఏర్పడింది. ఫలితంగా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారంట్లపై ప్రభావం పడింది. పలు హాస్టళ్లు, మెస్‌లు తమ మెనూల నుంచి కొన్ని ఆహార పదార్థాలను తొలగిస్తున్నాయి. కొన్నిచోట్ల గ్యాస్ సిలిండర్లకు బదులు కట్టెల పొయ్యిలు, బొగ్గు కుంపట్లను వినియోగిస్తున్నారు.

# వార్.. మార్కెట్లు మళ్లీ బేజార్... సెన్సెక్స్ 1300 పాయింట్లు డౌన్




దేశీయ మార్కెట్లు బుధవారం భారీ నష్టాల్లో ముగిశాయి (Stock Market Today). అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు, ఇరాన్ యుద్ధం ద్రవ్యోల్బణం, వృద్ధిపైన ప్రభావం చూపుతుందన్న ఆందోళనలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర పతనమైంది. నిఫ్టీ 23,900 దిగువన ముగిసింది.

ఉదయం సెన్సెక్స్ స్తబ్దుగా 78,238 వద్ద ప్రారంభమైంది (క్రితం ముగింపు 78,205). ఒక దశలో 78,324 గరిష్ఠానికి చేరింది. తర్వాత సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 1342 పాయింట్ల మేర కుంగి..76,863 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 394 పాయింట్లు క్షీణించి, 23,866 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 19 పైసలు పడిపోయి 92.04గా ఉంది.

నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, కోల్ ఇండియా, ఎన్‌టీపీసీ షేర్లు రాణించాయి. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ , బజాజ్ ఫిన్‌సర్వ్, ఎం అండ్ ఎం, ఐషర్ మోటార్స్ స్టాక్స్ నష్టపోయాయి. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై స్పష్టత లేకపోవడం, చమురు ధరల్లో అస్థిరతలు, విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడం నష్టాలకు దారితీశాయి.

## ₹14,500కే అరుణాచలం, రామేశ్వరం, కన్యాకుమారి టూర్



తమిళనాడులోని పుణ్యక్షేత్రాలు దర్శించుకోవాలని అనుకుంటున్నారా? అయితే, యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ (IRCTC) దివ్య దక్షిణయాత్ర అరుణాచలం చిదంబరం' పేరిట ఓ టూర్ ప్యాకేజీని తీసుకొచ్చింది. మొత్తం ఏడు రాత్రులు, ఎనిమిది పగళ్లు కొనసాగుతుంది. టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాసుల్లో ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకోవచ్చు. టికెట్ ధరలు రూ.14,500 నుంచి ప్రారంభమవుతాయి.

తమిళనాడులోని ప్రధాన క్షేత్రాలైన తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, తిరుచ్చి, తంజావూర్, చిదంబరం ప్రాంతాలను చుట్టి రావొచ్చు. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు సికింద్రాబాద్ నుంచి మే 24న ప్రారంభం కానుంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా ఈ రైలు ప్రయాణిస్తుంది. సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కొచ్చు. ప్రయాణం అనంతరం ఆయా రైల్వే స్టేషన్లలో యాత్రికులు దిగే వెసులుబాటు ఉంది.

ప్రయాణం ఇలా..

సికింద్రాబాద్ నుంచి మే 24న మధ్యాహ్నం 12 గంటలకు రైలు బయలుదేరుతుంది.

రెండో రోజు ఉదయం 9:15 గంటలకు అరుణాచలం చేరుకుంటారు. ఆలయాన్ని దర్శించుకుంటారు. తిరిగి రైల్వేస్టేషన్‌కు చేరుకొని రామేశ్వరం పయనమవుతారు. మూడో రోజు ఉదయం 8 గంటలకు కుడల్ నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామేశ్వరానికి బస్సులో బయలుదేరుతారు. హోటల్ బస అనంతరం రామనాథ స్వామి ఆలయ దర్శనం ఉంటుంది. అనంతరం స్థానికంగా ఉన్న ఆలయాలను (సొంత ఖర్చులతో) దర్శించుకోవచ్చు. రాత్రి భోజనం, బస ఉంటుంది. నాలుగో రోజు మధ్యాహ్నం భోజనం తర్వాత రామేశ్వరం నుంచి మధురైకి బస్సులో పయనమవుతారు. సాయంత్రం మీనాక్షి అమ్మవారిని దర్శించుకుంటారు. స్థానికంగా షాపింగ్‌కు అవకాశం కల్పిస్తారు. అనంతరం కుడల్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని కన్యాకుమారికి రైలులో పయనమవుతారు.

ఐదో రోజు ఉదయం 5 గంటలకు కన్యాకుమారి/నాగర్‌కోయిల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. ఫ్రెష్ అయ్యాక అక్కడి ప్రకృతి అందాలను వీక్షించొచ్చు. వివేకానంద రాక్ మెమోరియల్, గాంధీ మండపం, అందమైన సూర్యాస్తమయాన్ని చూడొచ్చు. ఆ తర్వాత తిరుచిరాపల్లికి పయనమవుతారు.

ఆరో రోజు ఉదయం 8 గంటలకు తిరుచిరాపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడే హోటల్‌లో బస ఉంటుంది. తర్వాత శ్రీరంగనాథస్వామి ఆలయం దర్శించుకొని మధ్యాహ్న భోజనం ముగించుకుంటారు. అక్కడినుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న తంజావూర్‌లోని బృహదీశ్వర ఆలయ దర్శనం ఉంటుంది. మళ్లీ తిరుచిరాపల్లిలో బస, భోజనం ఉంటుంది.

మరుసటి రోజు (ఏడో రోజు) తిరుచిరాపల్లి నుంచి చిదంబరానికి బయల్దేరతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు చిదంబరం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న నటరాజ స్వామి ఆలయానికి ప్రయాణికులు సొంత ఖర్చులతో చేరుకోవాల్సి ఉంటుంది. అనంతరం చిదంబరంలో రాత్రి 8 గంటలకు సికింద్రాబాద్‌కు రైలు బయలుదేరుతుంది.

ఎనిమిదో రోజు రాత్రి 8 గంటలకు రైలు సికింద్రాబాద్ చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది.

ప్యాకేజీ ఛార్జీలు ఇలా..

ఎకానమీ (స్లీపర్ క్లాస్) ఒక్కో టికెట్ ధర రూ.14,500 నిర్ణయించారు. 511 ఏళ్ల మధ్య చిన్నారులకు అయితే రూ.13,500 చెల్లించాలి. వీరికి బస చేసే హోటల్‌లో నాన్‌ఏసీ గదులు ఇస్తారు. ఒక్కో గదిలో నలుగురైదుగురు బస చేయాల్సి ఉంటుంది. నాన్ ఏసీ వాహనాల్లో ప్రయాణం ఉంటుంది.

స్టాండరడ్‌లో (3ఏసీ) టికెట్ ధర పెద్దలకు రూ.21,700; 511 ఏళ్ల మధ్య చిన్నారులకు రూ.20,600 చెల్లించాలి. రాత్రిపూట బసకు ఏసీ గదులు కేటాయిస్తారు. ఒక్కో గదిలో ఇద్దరూ లేదా ముగ్గురు బస చేయాల్సి ఉంటుంది.

కంఫర్ట్‌లో (2ఏసీ) టికెట్ ధరను రూ.27,900; 511 ఏళ్ల మధ్య చిన్నారులకు రూ.26,600 చెల్లించాలి. బస చేసేందుకు ఏసీ గదులు ఇస్తారు. ఇద్దరూ లేదా ముగ్గురు గదిని షేర్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్యాకేజీలో ఇవీ భాగం

ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం (శాకాహారం) అంతా రైల్వే సిబ్బందే చూసుకుంటారు. ప్యాకేజీని బట్టి ప్రయాణానికి ఏసీ వాహనం సమకూరుస్తారు. యాత్రికులకు ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటుంది. అవసరమైన సాయం కోసం ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్లు అందుబాటులో ఉంటారు. పర్యాటక ప్రదేశంలో ఎక్కడైనా ప్రవేశ రుసుములు ఉంటే మాత్రం వ్యక్తులే చెల్లించుకోవాలి. కేటాయించిన గదులకు ఏవైనా అదనపు సదుపాయాలు కావాలంటే ఆ ఛార్జీలను యాత్రికులే భరించాలి.

క్యాన్సిలేషన్ పాలసీ

ఒకవేళ ఏదైనా కారణం చేత 15 రోజుల ముందు టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే ఒక్కో టికెట్‌కు రూ.250 క్యాన్సిలేషన్ ఛార్జీగా నిర్ణయించారు. అదే 814 రోజుల ముందు క్యాన్సిల్ చేసుకుంటే 25 శాతం, 47 రోజుల ముందు క్యాన్సిల్ చేసుకుంటే 50 శాతం టికెట్ ధర నుంచి మినహాయిస్తారు. అయితే ప్రయాణానికి నాలుగు రోజుల ముందు క్యాన్సిల్ చేస్తే ఎలాంటి తిరిగి చెల్లింపులూ ఉండవు.

## అమెరికాలో రిలయన్స్ భారీ పెట్టుబడి: ప్రకటించిన ట్రంప్

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (Reliance Industries Limited) అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. టెక్సాస్‌లోని బ్రౌన్స్‌విల్లే ప్రాంతంలో రిలయన్స్ భాగస్వామ్యంతో భారీ చమురు శుద్ధి కేంద్రం ఏర్పాటుకానున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం విలువ 300 బిలియన్ డాలర్లు అని వెల్లడించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు.

దాదాపు 50 ఏళ్ల తర్వాత అమెరికాలో కొత్త చమురు శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. 300 బిలియన్ డాలర్ల ఈ ఒప్పందాన్ని చరిత్రాత్మకంగా అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల వేలాది మందికి ఉద్యోగాలు రావడంతో పాటు టెక్సాస్ ఆర్థికపరంగా వృద్ధి చెందుతుందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన భారత్‌లోని భాగస్వాములు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కి ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌తో అమెరికా ఇంధన ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని, ఎగుమతులు పెంచేందుకు సాయపడుతుందని వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన శుద్ధి కర్మాగారం అవుతుందన్నారు.





## రూ.150 టికెట్ ధరలతోనే రూ.50 కోట్లు.. ఇదే అసలైన విజయం!



పెళ్లిరోజు నుంచే ఆర్థిక లావాదేవీలన్నింటినీ తన భార్య ఆర్తినే చూసుకుంటున్నారని, అందుకు గర్వంగా ఉందని నటుడు శివ కార్తికేయన్ (Sivakarthikeyan) పేర్కొన్నారు. తన బ్యాంకు ఖాతాలో డబ్బు ఎంత ఉందో తనకు తెలియదని, సినిమా టికెట్టుకూ సతీమణినే మనీ అడుగుతానని తెలిపారు. తాను నిర్మించిన కొత్త సినిమా 'తాయ్ కిళవి' సక్సెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ చిత్రం మహిళలకు అంకితమన్నారు. ''తాయ్ కిళవి' (Thaai Kizhavi) కథను రెండు సార్లు విన్నాను, చదివాను. రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఇందులోని సన్నివేశాలను చెక్ చేసేవాడిని. పూర్తిగా 12 సార్లు ఈ చిత్రాన్ని చూశా. ఇకపై నేను నటించే సినిమాలకూ ఇలాగే వ్యవహరించాలనుకుంటున్నా. ఇలా చేసినంత మాత్రాన మూవీ బ్లాక్‌బస్టర్ అయిపోతుందా? అని మీరు అడగొచ్చు. హిట్, ఫ్లాప్ అనేవి నా చేతుల్లో లేని అంశాలు. కానీ, పక్కా ప్లానింగ్ ఉంటే నిర్మాతకు ఖర్చు తగ్గుతుంది. దానితో మరో సినిమా చేయొచ్చు. ఈ చిత్రం చూశాక దర్శకుడు శివకుమార్ తండ్రి.. అతడిని, నన్ను హగ్ చేసుకుని ఎమోషనల్ అయ్యారు. ఆ క్షణం మా నాన్న గుర్తొచ్చారు. ఆయన నా సక్సెస్‌ను చూస్తున్నారనిపించింది'' అని పేర్కొన్నారు. ఇందులో వృద్ధురాలి పాత్ర పోషించారు రాధిక. సినిమాలో ప్రధాన పాత్ర పోషించిన రాధికా శరత్‌కుమార్ (Radhika Sarathkumar) మాట్లాడుతూ.. ''కొందరు అగ్ర హీరోల సినిమాల టికెట్లను రూ.1500/రూ.2000కు విక్రయిస్తుంటారు. కానీ, రూ.150 టికెట్ ధరలతోనే ఈ సినిమా రూ.50 కోట్లకుపైగా వసూలు చేసింది. ఇదే అసలైన విజయం అని అనుకుంటున్నా'' అని అన్నారు. ఈ కామెడీ డ్రామా మూవీ తమిళంలో ఫిబ్రవరి 27న విడుదలైంది.



## పవన్ విషయంలో.. నాకు ఆ స్వార్థం ఉంది: హరీశ్ శంకర్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' (Ustaad Bhagat Singh). ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం పవన్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పాటలు, పోస్టర్‌లతో అంచనాలు పెంచేసిన దర్శకుడు తాజాగా ఓ కామెంట్‌తో వాటిని రెట్టింపు చేశారు.

ఉగాది సందర్భంగా మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ఆయన (Harish Shankar) సినిమాకు సంబంధించిన విశేషాలను పంచుకుంటున్నారు. తాజాగా ఆయన ఈ చిత్రం ఇంటర్వెల్ సీన్ గురించి మాట్లాడారు. పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే ఇది బెస్ట్ ఇంటర్వెల్ సీన్ అవుతుందని చెప్పారు. గతంలో 'గబ్బర్ సింగ్'లో పవన్‌ను చూపించిన తీరు ఒక ఎత్తయితే, ఇందులో అంతకుమించి ఉంటుందని హింట్ ఇచ్చారు.

అలాగే పవన్ అంటే తనకు ఎంత అభిమానమో మరోసారి తెలిపారు. 'ఆయన్ని (Pawan Kalyan) వెండితెరపై అత్యంత పవర్‌ఫుల్‌గా చూపించాలనే స్వార్థం నాకుంది. ఈ సినిమా చూశాక.. పవన్‌ను ఇంత మాస్‌గా హరీశ్ మాత్రమే చూపించగలడని అందరూ అనాలి" అని చెప్పారు. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా కనిపించనున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఎలాంటి కట్స్ లేకుండా యూ/ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు చిత్రబృందం ప్రకటించింది.

# ఇది ఫిర్యాదు కాదు.. వాస్తవం!

"నాలో ఐదేళ్ల.. అత్యాశపరుడైన ఒక చిన్న పిల్లాడు ఉన్నాడు. వాడు కొత్త అనుభవాల్ని, మార్పుల్ని కోరుకుంటున్నాడ"ని అంటోంది అందాల తార అదితీ రావ్ హైదరీ. కళ్లతోనే హావభావాల్ని పలికిస్తూ.. తనదైన నటనతో ఆకట్టుకునే కథానాయికీమె. వైవిధ్యమైన కథలతో మెప్పించే ఈమె ఇటీవలే 'గాంధీ టాక్స్' అనే మూకీ చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అదితి పంచుకున్న ఆసక్తికర సంగతులు....

"గాంధీ టాక్స్' సినిమా నా దగ్గరకు వచ్చినప్పుడు నిజంగా చాలా ఉత్సాహంగా అనిపించింది. కథేంటో తెలియదు కానీ ఇది సైలెంట్ ఫిల్మ్ అని మాత్రమే తెలుసు. దీనిపై దర్శకుడు కిశోర్ చాలా సంవత్సరాలు పనిచేశారు. విజయ్‌సేతుపతితో నేను దాదాపు మూడు సినిమాలు చేశాను. కానీ వాటిలో ఏవీ పనిచేయలేదు. ఇప్పుడు మా కలయికలో వచ్చిన ఈ మూకీ చిత్రానికి మంచి స్పందన రావడం సంతోషంగా ఉంది. దీని తర్వాత ఇంతియాజ్ అలీ దర్శకత్వం వహిస్తున్న 'ఓ సాథీ రే' అనే మరో వైవిధ్యమైన కథతో రాబోతున్నా".

**ఎవరి పద్ధతి వారిది**

"ఎంత బిజీ షెడ్యూల్‌లో ఉన్నా కూడా పని విషయంలో హద్దులు పెట్టుకోను. ఏదైనా నాకు మనస్ఫూర్తిగా అనిపిస్తే.. దాన్ని చేసేస్తాను. నాతో పనిచేసే వ్యక్తులను నేను ఇష్టపడితే.. సమయాన్నే మర్చిపోతాను. కొన్ని సార్లు సెట్‌లో ప్రతిదీ సవాలుగానే అనిపిస్తుంది. వ్యక్తిగతంగా కాదు.. కేవలం అక్కడి పరిస్థితుల రీత్యా. అయినప్పటికీ చాలా సెట్లలో నాకు ఎంతో ప్రోత్సాహం లభించింది. నేను పనిచేసిన అద్భుతమైన దర్శకులలో 98శాతం మంది నాతో చక్కగా ఉన్నారు. అయితే ఎవరి పద్ధతి వారిదని నేను నమ్ముతా. కానీ ఎంచుకున్న కథలో మీరు వంద శాతం న్యాయం చేస్తున్నారో లేదో చూసుకోవాలి".

**నాకిది అలవాటే**

"నేను సినీ నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన నటిని. నేను పనిచేయాలని కోరుకున్న జాబితాలో ఉన్న దర్శకులు నా ప్రతిభను గుర్తించి వారి దర్శకత్వంలో నటించే అవకాశాలు ఇస్తారని ఎదురుచూశా. కానీ బయటి వ్యక్తిగా వచ్చి వాణిజ్యపరంగా విజయం సాధించినా కూడా నా తర్వాతి సినిమా కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఇది ఫిర్యాదు కాదు.. వాస్తవాలు చెప్తున్నా. అయినా నాకిది అలవాటైపోయింది. దీంతో నాకెలాంటి ఇబ్బంది లేదు. కానీ నాకు అవకాశం వచ్చిన ప్రతీసారి ఆ పాత్రను ఆస్వాదిస్తూ.. పూర్తిగా ఆనందిస్తూ చేస్తాను".

**అంతా దర్శకుడిలోనే**

"ఇప్పుడిప్పుడే నేను ముంబయిలో స్థిరపడి హిందీ ప్రాజెక్టుల్లో పనిచేస్తున్నాను. కానీ వేరే భాషలలో ఇతర దర్శకులతో కలిసి పనిచేయడాన్ని చాలా మిస్ అవుతున్నా. మరో భాషలో సినిమా చేస్తున్నప్పుడు.. 'అక్కడ ఇక్కడ తేడా ఏమిట'ని నన్ను అడిగేవారు. బేధం అంటే ఆ నౌకకు కెప్టెన్ అయిన వ్యక్తిలోనే ఉంటుంది. అంటే దర్శకుడిలోనే. ఆయన సెట్‌ను ఎలా నడిపిస్తారనే దానిపైనే అంతా ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే సినిమా అంటేనే భావోద్వేగాల్ని పంచడం. ఇప్పుడు 'గాంధీ టాక్స్' అనే మూకీ చిత్రం చేయడం వల్ల ఆ విషయం నాకు మరింతగా తెలిసి వచ్చింది".



## మీ చెడు ఆలోచనలను మీతోనే ఉంచుకోండి : రవి మోహన్



తనపై వచ్చిన ట్రోల్స్‌పై కోలీవుడ్ నటుడు రవి మోహన్ (జయం రవి) స్పందించారు. మహిళలే కరెక్ట్ అని చాలా మంది అనుకుంటారని, కానీ అసలైన బాధితులు పురుషులే అని పేర్కొన్నారు (Ravi Mohan). "ప్రేమించిన వారి కోసం నేను ఏం చేశానన్నది ఏదో ఒక రోజు మీకు తెలుస్తుంది. నన్ను ఇలా బతకనివ్వండి. మీ చెడు ఆలోచనలను మీతోనే ఉంచుకోండి'' అంటూ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు (Jayam Ravi).

తన భార్య ఆర్తి నుంచి విడాకులు తీసుకున్నట్లు రవి మోహన్ 2024లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే.. గాయని కెనీషాతో ఆయన రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ రూమర్స్ వచ్చాయి. రవి మోహన్ దర్శకత్వం వహిస్తున్న ఓ కొత్త సినిమా ప్రారంభోత్సవానికి కెనీషా హాజరయ్యారు. ఆ వేడుకలో తాము కలిసి దిగిన ఫొటోలను నటుడు కొన్ని రోజుల క్రితం షేర్ చేశారు. దీంతో, ఆయన వైఖరిని వ్యతిరేకిస్తూ కొందరు నెటిజన్లు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే రవి మోహన్ రియాక్ట్ అయ్యారు.

'పరాశక్తి'లోని ఓ కీలక పాత్రతో ప్రేక్షకులను ఇటీవల పలకరించారు రవి మోహన్. ప్రస్తుతం 'బ్రో కోడ్'లో నటిస్తున్నారు. యోగిబాబు హీరోగా 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికి నిర్మాత కూడా ఆయనే.

## మహేశ్ అభిమానులకు హరీశ్ శంకర్ క్షమాపణలు





ఒక సినిమా హిట్ కావాలంటే అందరి హీరోల అభిమానుల మద్దతు ఉండాలని దర్శకుడు హరీశ్ శంకర్ (Harish Shankar) అన్నారు. ఆయన దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' మార్చి 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఓ అభిమానికి ఇచ్చిన రిప్లైపై వివరణ ఇస్తూ మహేశ్ ఫ్యాన్స్‌కు సారీ చెప్పారు. పని ఒత్తిడిలో ఉన్నందున ఆ అభిమాని పోస్ట్ పూర్తిగా చదవకుండా రిప్లై ఇచ్చినట్లు చెప్పారు.

''కొన్ని రోజులుగా పని ఒత్తిడిలో ఉన్నాను. సెన్సార్ పనులు, అనంతరం బోర్డు అధికారులతో సమావేశం, పెద్దమ్మ తల్లి దర్శనం, పోస్ట్ ప్రొడక్షన్ పనులు, సాంగ్ ప్రోమో ఫైనల్ చెక్ చేయడం.. ఇలా ఎంతో బిజీగా ఉన్నాను. ఈ బిజీ షెడ్యూల్ మధ్యలో సినిమా (Ustaad Bhagat Singh) ప్రోమోపై వస్తున్న స్పందనలకు కృతజ్ఞతలు తెలుపుతూ సోషల్ మీడియాలో రిప్లైలు ఇస్తున్నాను. ఆ హడావిడిలో ఒక ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే పొరపాటున కోట్ చేశా. వెంటనే నా టీమ్ అప్రమత్తం చేయడంతో పొరపాటును గ్రహించి నిమిషం వ్యవధిలోనే ఆ రిప్లై తొలగించాను''

''సూపర్‌స్టార్ మహేశ్‌బాబు (Mahesh Babu) అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. 'వారణాసి' (Varanasi) చిత్రంతో ఆయన మరెన్నో రికార్డులు సృష్టిస్తారని నమ్ముతున్నా. గతంలో 'పోకిరి' గురించి నేను పెట్టిన పోస్ట్‌లను చూస్తే మహేశ్‌పై నాకున్న అభిమానం అర్థమవుతుంది. ఫ్యాన్స్ మనోభావాలను దెబ్బతీయాలనే ఉద్దేశం నాకు లేదు'' అని తన లేఖలో హరీశ్ రాసుకొచ్చారు. ఒక సినిమా విజయవంతం కావాలంటే అందరు హీరోల అభిమానుల మద్దతు అవసరమని, సినిమా విడుదలకు కేవలం 10 రోజుల సమయం ఉన్నప్పుడు ఇలాంటి వివాదాలకు తావిచ్చేంత అవివేకిని కాదని ఆయన అన్నారు. అనుకోకుండా జరిగిన ఈ పొరపాటు వల్ల ఎవరికైనా బాధ కలిగిఉంటే మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని, అందరూ పెద్ద మనసుతో అర్థం చేసుకుని 'ఉస్తాద్ భగత్ సింగ్'ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు (Harish Shankar apologizes).

**అసలేం జరిగిందంటే..**


సోషల్ మీడియాలో హరీశ్ శంకర్ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులకు, నెటిజన్లకు రిప్లైలు ఇస్తూ ఉంటారు. ఈనేపథ్యంలో తాజాగా ఓ నెటిజన్.. మహేశ్ రికార్డుల గురించి, ఆయన రానున్న చిత్రంపై నెగెటివ్‌గా పోస్ట్ పెట్టారు. దానికి హరీశ్‌శంకర్ అనుకోకుండా రిప్లై పెట్టారు. దీంతో నెట్టింట విమర్శలు మొదలయ్యాయి (Harish Shankar Tweet Controversy). వెంటనే ఆ రిప్లై డిలీట్ చేసినప్పటికీ అది అప్పటికే వైరల్ కావడంతో ఆయన క్షమాపణలు చెబుతూ లేఖ విడుదల చేశారు.

## నా మనుగడ లేదనుకున్న టైమ్‌లో ఈ సినిమా వచ్చింది: తమ్మారెడ్డి భరద్వాజ

జగపతి బాబు, లయ, హృతిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వదలా' (Vadhala). ఆకెళ్ల వి. కృష్ణ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రానికి తమ్మారెడ్డి భరద్వాజ, కిశోర్ నాయుడు నిర్మాతలుగా వ్యవహరించారు. తాజాగా ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీమ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. అందులో తమ్మారెడ్డి మాట్లాడుతూ.. తాను సినిమాలు నిర్మించి 15 ఏళ్లు అయిందన్నారు.

''చాలా ఏళ్ల తర్వాత సినిమాకు నిర్మాతగా వ్యవహరించాలంటే భయపడ్డాను. దర్శకుడికి కథపై ఉన్న నమ్మకంతో దీన్ని ముందుకు తీసుకెళ్లాం. నాకు మనుగడలేదు.. ఇండస్ట్రీలో ఉండలేను అనుకున్న టైమ్‌లో ఈ సినిమా తీశాం. షూటింగ్ కోసం అందరూ నిరంతరం కష్టపడ్డారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్ చేసేవారు. ఈరోజుల్లో కూడా ఇలా కష్టపడేవారు ఉన్నారా? అని ఆశ్చర్యపోయా. జగపతి బాబు లేకుండా ఈ సినిమాను ఊహించుకోలేం'' అని తమ్మారెడ్డి (Tammareddy Bharadwaj) అన్నారు. ఈ ఏడాదితో ఆయన ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు అవుతుందని చెప్పారు.

''నేను పరిశ్రమకు వచ్చిన కొత్తలో భరద్వాజతో ఒక సినిమా చేయాల్సి ఉంది. కథ ఏమిటని అడిగితే.. 'సినిమాలో కథ ఏం లేదు' అన్నారు. అయితే నేను కూడా చేయను అని వచ్చేశా. ఆ తర్వాత 'అంతఃపురం' చేశా. మళ్లీ ఇన్నేళ్లకు 'వదలా'తో కలిసాం. ఆ సినిమా టైటిల్ సాంగ్ ఎన్నోవేల సార్లు విన్నా. లయతో స్క్రీన్ పంచుకోవడం ఎప్పుడూ ఆనందమే'' అని జగపతి బాబు (Jagapathi babu) అన్నారు



## కీరవాణి ఇంట పెళ్లి బాజాలు: కాలభైరవ మనసు గెలిచిన 'బలగం' బ్యూటీ?



టాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు కీరవాణి కుటుంబంలో త్వరలోనే శుభకార్యం జరగబోతుందనే వార్త ఇప్పుడు ఫిలిం నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కీరవాణి కుమారుడు, తన గాత్రంతోనూ, సంగీతంతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కాలభైరవ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సమాచారం. అయితే, ఆయన పెళ్లాడబోయే అమ్మాయి మరెవరో కాదు... టాలీవుడ్ యువ నటి కావ్య కళ్యాణ్ రామ్ అని తెలుస్తోంది. వీరిద్దరి మధ్య కొంతకాలంగా సాగుతున్న పరిచయం కాస్తా ప్రేమగా మారిందని, ఇప్పుడు ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో పెళ్లి పీటలు ఎక్కేందుకు సిద్ధమైనట్లు ఫిలిం నగర్ టాక్. కాలభైరవ 'కార్తికేయ 2' వంటి చిత్రాలతో మ్యూజిక్ డైరెక్టర్‌గా తన సత్తా చాటగా, కావ్య కళ్యాణ్ రామ్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టి 'మసూద', 'బలగం' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలతో హీరోయిన్‌గా మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం రెండు కుటుంబాల్లో వివాహ వేడుకలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, ముహూర్తాలు ఖరారైన తర్వాత సోషల్ మీడియా వేదికగా అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సన్నిహిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. మెగా, అక్కినేని కుటుంబాల వివాహ వేడుకల సందడి తర్వాత, ఇప్పుడు కీరవాణి ఇంట జరగబోయే ఈ వేడుకపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## వరల్డ్ కప్ హీరో సామాన్యుడిలా.. ఫ్లైట్ టికెట్లు దొరక్క.. రైల్లో ముంబైకి శివమ్ దూబే!



2026 టీ20 ప్రపంచకప్ గెలిచి చారిత్రక విజయంలో భాగమైన భారత ఆల్‌రౌండర్ శివమ్ దూబే, తన ఇంటికి వెళ్లేందుకు వినూత్న మార్గాన్ని ఎంచుకున్నాడు. సహచర ఆటగాళ్లు ప్రత్యేక విమానాల్లో తమ ఇళ్లకు పయనమవుతుండగా, దూబే మాత్రం అహ్మదాబాద్ నుంచి ముంబైకి రైలులో ప్రయాణించాడు. ప్రపంచకప్ విజయం తర్వాత అహ్మదాబాద్ నుంచి ముంబైకి విమానాలన్నీ పూర్తిగా నిండిపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. స్టార్ క్రికెటర్ అయి ఉండి సాధారణ రైలులో ప్రయాణించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ప్రయాణం గురించి శివమ్ దూబే 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "విమాన టికెట్ల కోసం చాలా ప్రయత్నించాం. కానీ, ఏవీ అందుబాటులో లేవు. రోడ్డు మార్గంలో వెళ్లే అవకాశం ఉన్నా, రైలు ప్రయాణం వేగంగా ఉంటుందని భావించి, ఉదయాన్నే రైలు ఎక్కాలని నిర్ణయించుకున్నా" అని ఆయన వివరించాడు. తన భార్య, స్నేహితుడితో కలిసి 3 టైర్ ఏసీ టికెట్లు బుక్ చేసుకున్నాడు. అయితే, ఈ నిర్ణయం పట్ల తన కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని దూబే తెలిపాడు. "స్టేషన్‌లో లేదా రైల్లో ఎవరైనా గుర్తుపడితే పరిస్థితి ఏంటి అని అందరూ భయపడ్డారు" అని చెప్పాడు. దీంతో అభిమానుల కంటపడకుండా ఉండేందుకు ఆయన కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. తెల్లవారుజామున 5:10 గంటలకు బయలుదేరే రైలును ఎంచుకున్నాడు. ఆ సమయంలో ప్లాట్‌ఫామ్ ఖాళీగా ఉంటుందని భావించి, రైలు బయలుదేరడానికి ఐదు నిమిషాల ముందు కారు దిగి కోచ్ ఎక్కాడు. గుర్తుపట్టకుండా ఉండేందుకు మాస్క్, క్యాప్, పొడవాటి చేతులున్న టీషర్ట్ ధరించాడు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక పోలీసు అధికారి కూడా ఆయన వెంట ఉన్నారు. రైలులో తన భార్య అంజుమ్ ఖాన్‌తో కలిసి ప్రయాణించిన దూబే, ఎవరి దృష్టిలో పడకుండా ఉండేందుకు పై బెర్త్‌ను ఎంచుకున్నాడు. అయితే, టికెట్ చెకర్ (టీసీ) వచ్చినప్పుడు ఒక సరదా సంఘటన చోటుచేసుకుంది. 'శివమ్ దూబే? ఎవరు అతను, క్రికెటరా?' అని టీసీ అడగ్గా, వెంటనే దూబే భార్య కల్పించుకుని, 'అతనెక్కడి నుంచి వస్తాడులే' అని తెలివిగా సమాధానమిచ్చారు. దీంతో టీసీ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రయాణం సాఫీగా సాగిందని, అయితే బోరివలీ స్టేషన్‌లో పగటిపూట దిగేటప్పుడు మాత్రం జనం గుర్తుపడతారేమోనని కొద్దిగా ఆందోళన చెందానని దూబే తెలిపాడు. చివరికి పోలీసుల భద్రత మధ్య ఆయన స్టేషన్ నుంచి సురక్షితంగా బయటకు వచ్చాడు.

## గంభీర్ - అగార్కర్ ద్వయం. ...ఇక అదే వారి లక్ష్యం!



ఆటగాళ్లు సరైన ప్రదర్శన చేస్తే మ్యాచ్‌లోనైనా టోర్నీలోనైనా నెగ్గుతాం. మరి వారిని నడిపించే మార్గదర్శి కూడా అదే స్థాయిలో ఉండాలి. ఆ ప్లేయర్లను ఎంపిక చేసే సెలక్టరుకూ పరిజ్ఞానం బాగుండాలి. మూడు అంశాలు కుదిరితే 'కప్ నెగ్గడం' అనే వంటకం విజయవంతంగా తయారవుతుంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ద్వయానికి కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ తోడు కావడంతో టీ20 ప్రపంచ కప్‌ను టీమ్ఇండియా గెలుచుకుంది. పొట్టి కప్ ముందు అగార్కర్‌గంభీర్ తీసుకున్న కఠిన నిర్ణయాలతోనే ఇది సాధ్యమైంది.

**గిల్‌ను పక్కన పెట్టి.. సూర్యపై నమ్మకం ఉంచి**

రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పడంతో హార్దిక్‌కు కెప్టెన్సీ అవకాశం ఇస్తారని అంతా భావించారు. కానీ, సూర్యకుమార్ యాదవ్‌ను సారథిగా తీసుకొచ్చారు. టీ20 ప్రపంచ కప్ ముందు జరిగిన ద్వైపాక్షిక సిరీసుల్లో శుభ్‌మన్ గిల్‌ను సూర్యకు డిప్యూటీగా మేనేజ్‌మెంట్ నియమించింది. భవిష్యత్తులో గిల్‌కే సారథ్యం అప్పగిస్తారనే ప్రచారమూ సాగింది. గిల్ మాత్రం వరుసగా విఫలమై నిరాశపరిచాడు. మరోవైపు సూర్య కివీస్‌తో జరిగిన సిరీస్‌లో మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించాడు. దీంతో సూర్యపై నమ్మకం ఉంచిన అగార్కర్‌గంభీర్ ద్వయం అతడినే కొనసాగించింది. సూర్య దూకుడుగా ఆడగలడని భావించిన సెలక్షన్ కమిటీ.. గిల్ టీ20ల్లో ఇబ్బంది పడుతుంటంతో వేటు వేసింది. తమకు ఆడే విధానమే ముఖ్యమని.. ఫామ్ తాత్కాలికమని ఇతర సభ్యులకూ హెచ్చరిక పంపినట్లైంది. దాదాపు రెండేళ్లపాటు జాతీయ జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్‌కు మళ్లీ అవకాశం కల్పించింది. అతడు దేశవాళీలో అదరగొట్టాడు. దూకుడుగా ఆడే నైజం అతడి సొంతం. టీ20 ప్రపంచ కప్‌లోనూ అతడు ఏ స్థాయిలో విధ్వంసం సృష్టించాడో మనందరికీ తెలిసిందే. అందుకే, ఈ కప్ గెలిచిన తర్వాత.. అగార్కర్‌కు ఈ ట్రోఫీని అంకితం చేస్తున్నట్లు గంభీర్ చెప్పాడంటే జట్టు ఎంపిక విషయంలో చీఫ్ సెలక్టర్‌గా తీసుకున్న నిర్ణయాలే అందుకు కారణం.

**ముమ్ముందూ ఇలానే...**

గంభీర్‌అగార్కర్ ద్వయం నేతృత్వంలో భారత్ ఇప్పటికే మూడు టైటిళ్లను సొంతం చేసుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ (2025), ఆసియా కప్ (2026), టీ20 ప్రపంచ కప్ (2026)లను భారత్ సాధించింది. చీఫ్ సెలక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవీ కాలం ఈ ఏడాది జూన్‌తో ముగియనుంది. ఇప్పటికే అతడి పదవీకాలం పొడిగించిన సంగతి తెలిసిందే. అయితే, 2027లో వన్డే ప్రపంచ కప్, వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, 2028లో ఒలింపిక్స్‌తోపాటు అదే ఏడాది టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో.. అగార్కర్ పదవి కాలాన్ని మరికొంతకాలం పొడిగిస్తారనే ఊహాగానాలు వస్తున్నాయి. మరోవైపు గంభీర్ పదవీకాలం కూడా వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ వరకు మాత్రమే ఉంది. వీరిద్దరి సేవలను మరికొంతకాలం వాడుకుంటే మరిన్ని టైటిళ్లు వస్తాయనేది అభిమానుల ఆశ. ఇప్పటికే సూర్య కుమార్ యాదవ్ తన లక్ష్యాలేంటో చెప్పాడు.

ప్లేయర్‌గా, కోచ్‌గా ఇప్పటికే టీ20 ప్రపంచ కప్‌లను ముద్దాడిన గంభీర్.. వన్డే ప్రపంచ కప్‌నూ సాధిస్తే మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకోవడం ఖాయం. మరే ఇతర ప్రధాన కోచ్ కూడా ఇలాంటి రికార్డు నమోదు చేయలేదు. ధోనీ నాయకత్వంలో గెలిచిన 2011 వన్డే ప్రపంచ కప్ జట్టులోనూ గంభీర్ సభ్యుడే అన్న సంగతి తెలిసిందే.

### టాప్2 బ్యాటర్లు మనోళ్లే..

## అగ్రస్థానం కోల్పోయిన వరుణ్ చక్రవర్తి

టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత స్టార్ ఆటగాళ్లు అదరగొట్టారు. ఆ శ్రమకు ప్రతిఫలంగా భారత్‌కు వరల్డ్ కప్ దక్కింది. తాజాగా విడుదలైన ఐసీసీ ర్యాంకుల్లోనూ కొందరు జోరు ప్రదర్శించారు. బ్యాటింగ్ విభాగంలో టాప్ 2 ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ఫైనల్‌లో హాఫ్ సెంచరీ చేసిన అభిషేక్ శర్మ (875 పాయింట్లు) తన అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు.ఇషాన్ కిషన్ (871 పాయింట్లు) రెండు స్థానాలను మెరుగుపర్చుకుని రెండో ర్యాంకుకు చేరాడు. పాక్ బ్యాటర్ సహిబ్జాద (848), ఫిల్ సాల్ట్ (792) ఒక్కో ప్లేస్ దిగజారారు. తిలక్ వర్మ (742) కూడా ఒక స్థానం కోల్పోయి ఏడో ర్యాంకులో నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన సంజు శాంసన్ ఏకంగా (637) ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకుకు చేరాడు. శివమ్ దూబే (606) కూడా నాలుగు ర్యాంకులు పైకొచ్చి 27వ స్థానంలో నిలిచాడు.

**రెండుకు పడిపోయిన వరుణ్**

టీ20 ప్రపంచ కప్‌లో వరుణ్ చక్రవర్తి 14 వికెట్లు తీశాడు. అయినా సరే.. అతడు మాత్రం తన ఐసీసీ టాప్ ర్యాంక్‌ను మాత్రం కాపాడుకోలేకపోయాడు. ఫైనల్‌లో కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీసి కాస్త ఎక్కువగా పరుగులు సమర్పించాడు. దీంతో పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. అఫ్గాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (753) అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. దాదాపు 68 పాయింట్లను పోగొట్టుకుని



వరుణ్ చక్రవర్తి (740) రెండో ర్యాంకుకు పరిమితమయ్యాడు. ఫైనల్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన జస్‌ప్రీత్ బుమ్రా (702) ఒక స్థానం మెరుగుపర్చుకుని ఆరో ర్యాంకుకు చేరాడు. అర్ష్‌దీప్ సింగ్ 16వ ర్యాంకు, అక్షర్ పటేల్ 17వ ర్యాంకులో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో మార్పులేమీ లేవు. జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా (328), భారత స్టార్ హార్దిక్ పాండ్య (299) తమ పాయింట్లను మెరుగుపర్చుకుని టాప్2లోనే కొనసాగుతున్నారు.

### ధోనీ ఆడతాడా? .. కీపింగ్ చేస్తాడా? :

## సస్పెన్స్ కు తెరదించిన కాశీ విశ్వనాథన్

- **ఐపీఎల్ 2026లో ధోనీ అన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం**
- **ధోనీ పాత్రపై తుది నిర్ణయం టీమ్ మేనేజ్‌మెంట్‌దేనని స్పష్టీకరణ**
- **చెన్నైలోనే సీఎస్కే హోమ్ మ్యాచ్‌లన్నీ జరుగుతాయని వెల్లడి**
- **ప్రపంచకప్ హీరోలు శాంసన్, దూబేలపై సీఈవో ప్రశంసలు**
- **ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 19వ సీజన్**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ ప్రారంభానికి సమయం దగ్గరపడుతుండటంతో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) అభిమానులకు ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ ఓ తీపి కబురు అందించారు. టీమిండియా మాజీ కెప్టెన్, సీఎస్కే లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనీ ఈ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. దీంతో ధోనీ ఫిట్‌నెస్, లభ్యతపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. ఈ నెల 28 నుంచి ఐపీఎల్ 2026 ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని ఫ్రాంచైజీలు ఇప్పటికే ప్రాక్టీస్ క్యాంపులను మొదలుపెట్టాయి. ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో పాల్గొన్న ఆటగాళ్లు త్వరలోనే తమ జట్లతో కలవనున్నారు. ఈ క్రమంలో కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. "నా అంచనా ప్రకారం, అతను (ధోనీ) అన్ని మ్యాచ్‌లలో ఆడతాడు" అని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే, జట్టులో ధోనీ పాత్ర ఎలా ఉండబోతోందనే ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. "ఆ విషయం నేను చెప్పలేను. అది పూర్తిగా క్రికెటింగ్‌కు సంబంధించిన నిర్ణయం. జట్టులోని క్రికెట్ సిబ్బంది ఆ నిర్ణయం తీసుకుంటారు. కానీ, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కాదు. అతను వికెట్ కీపర్‌బ్యాటర్‌గా ఆడతాడా, కేవలం బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగుతాడా, లేక ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడతాడా అనేది వారే నిర్ణయిస్తారు" అని కాశీ విశ్వనాథన్ వివరించారు. జట్టులో మరో వికెట్ కీపర్‌బ్యాటర్ సంజూ శాంసన్ కూడా ఉండటంతో ధోనీ పాత్రపై ఆసక్తి నెలకొంది. అలాగే, ఐపీఎల్ షెడ్యూల్‌పై మాట్లాడుతూ.. దేశంలో జరగనున్న ఎన్నికల ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని గురువారం షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. చెన్నై తమ హోమ్ మ్యాచ్‌లన్నింటినీ సొంత గడ్డపైనే ఆడుతుందని ఆయన ధ్రువీకరించారు. "మేము తమిళనాడులోనే ఆడాల్సి ఉంది. బీసీసీఐ షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నాం" అని ఆయన అన్నారు. ఇటీవల టీమిండియా వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ గెలవడం పట్ల కాశీ విశ్వనాథన్ సంతోషం వ్యక్తం చేశారు. ఆ విజయంలో కీలకపాత్ర పోషించిన సీఎస్కే ఆటగాళ్లు సంజూ శాంసన్, శివమ్ దూబేలను ప్రత్యేకంగా అభినందించారు. "భారత్ ప్రపంచకప్ గెలవడం చాలా ఆనందంగా ఉంది. మా ఆటగాళ్లు ఇద్దరూ అద్భుతంగా రాణించడం మాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. వారి ఫామ్ ఇక్కడ సీఎస్కేకు కూడా బాగా ఉపయోగపడుతుందనే నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. జట్టు ప్రాక్టీస్ క్యాంప్ సజావుగా సాగుతోందని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేవని కాశీ విశ్వనాథన్ తెలిపారు.

## కింగ్ ఈజ్ బ్యాక్.. ఐపీఎల్ కోసం యూకేలో కోహ్లీ సాధన

టీమిండియా మాజీ కెప్టెన్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) దిగ్గజ ఆటగాడు విరాట్ కోహ్లీ అప్పుడే రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) సీజన్ కోసం తన కసరత్తులు ప్రారంభించాడు. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 19వ ఎడిషన్ కోసం సిద్ధమవుతూ, నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన ఒక వీడియోను అభిమానులతో పంచుకున్నాడు.ప్రస్తుతం యూకేలో ఉన్న కోహ్లీ, ఇండోర్ నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియోలో కోహ్లీ తనదైన శైలిలో పవర్‌ఫుల్ షాట్లతో అలరించాడు. అతను పూర్తి ఫామ్‌లో ఉన్నట్లు కనిపించాడు. ఈ పోస్ట్‌కు "ఐపీఎల్ 2026" అని క్యాప్షన్ జోడించి, పక్కన ఒక ఇసుక గడియారం ఎమోజీని జత చేశాడు. దీంతో రాబోయే సీజన్‌పై అతను ఎంత సీరియస్‌గా ఉన్నాడో అర్థమవుతోంది. కోహ్లీ వీడియోను ఆర్సీబీ ఫ్రాంచైజీ కూడా తమ అధికారిక ఖాతాలో పంచుకుంది. "రన్ మెషిన్ చక్కగా ఆయిల్ వేసినట్లు కనిపిస్తోంది. ఐపీఎల్ 2026ను ఇప్పుడే మొదలుపెడదాం" అని వ్యాఖ్యానించింది. అంతకుముందు ఆర్సీబీతో కోహ్లీకి ఉన్న 18 ఏళ్ల అనుబంధాన్ని పురస్కరించుకుని ఫ్రాంచైజీ ఒక ప్రత్యేక పోస్ట్ చేసింది. "19 సీజన్లు, ఒకే జట్టు, ఒకే లెజెండరీ పేరు. 2008లో ఒక యువ ఆటగాడిగా వచ్చి, ఇప్పుడు ఫ్రాంచైజీకి ప్రత్యామ్నాయం లేని ఐకాన్‌గా ఎదిగాడు. 18 ఏళ్ల క్రితం ఇదే రోజున, అండర్19 డ్రాఫ్ట్ ద్వారా కోహ్లీని జట్టులోకి తీసుకున్నాం. అదే నిబద్ధత, అదే విధేయతతో ఈ ప్రయాణం కొనసాగుతోంది" అని పేర్కొంది.

2025లో ఆర్సీబీ తన ఐపీఎల్ టైటిల్ కరవును తీర్చుకోవడంలో కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో జట్టు తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. 15 ఇన్నింగ్స్‌లలో 144.71 స్ట్రైక్ రేట్‌తో 657 పరుగులు సాధించాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్‌లో 191 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకున్న ఆర్సీబీ, 6 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో కోహ్లీ 35 బంతుల్లో 43 పరుగులు చేసి జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. ఇప్పటికే టెస్టులు, టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్ రోజే అతను పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

